



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవీ

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :263 17 సోమవారం ఆగస్టు 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari




'కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసహరించండి'.. రాహుల్ గాంధీకి

## జార్ఖండ్ నిరసనకారులు డిమాండ్...

**రాంచి:**

జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించాలని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని విద్యార్థి నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న సీఎం హేమంత్ సోరెన్ నివాసాన్ని ముట్టడిస్తామని వారు స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో నిర్వహించిన నియామక పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న విద్యార్థులు గత 22 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ...మిగతా 2 లో...

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

### వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్
- వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన




తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ...మిగతా 2 లో...

### ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్.. కొరియా ద్వీపకల్పంలో

## అసలేం జరుగుతోంది...!

- కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా

2 లో





## ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం: బీజేపీ ఎంపీ అరవింద్‌కు కాంగ్రెస్ హెచ్చరిక

- మహేశ్ గౌడ్‌పై వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు
- ఎంపీ అరవింద్‌పై గాంధీ భవన్‌లో మీడియా సమావేశం
- హద్దు మీరితే ఉరికించి కొడతామని ఘాటు హెచ్చరిక
- పసుపు బోర్డు, గల్ఫ్ బాధితులపై అరవింద్‌ను నిలదీసిన నేతలు
- పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్

నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై అరవింద్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తన వైఖరి మార్చుకోకపోతే ఇంటికి వచ్చి ఉరికించి కొడతామని ఘాటుగా హెచ్చరించారు. శనివారం గాంధీ భవన్‌లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

...మిగతా 2 లో...

# బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన

## - తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి...

- నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- నవ దంపతులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరు
- వేడుకకు హాజరైన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు



ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని-సూర్యతేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. వారంతా నూతన దంపతులను అభినందించి, ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. బండ్ల గణేశ్ ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కనిపించారు.

## బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది..

### సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!

- ప్రతి ఆరు నెలలకు ఒక జాబ్ నోటిఫికేషన్ ఇస్తామని సీఎం హామీ
- సంగారెడ్డిలో 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- సన్నబియ్యం అందిస్తూ పేదల కడుపు నింపుతున్నామన్న రేవంత్‌రెడ్డి

2 లో





## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు సమకూరిస్తే నే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

...మిగతా 2 లో...

## కల్తీకి చెక్.. తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు..

### ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు

- ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- 'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం
- ఆహార, ఔషధాల కల్తీని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం
- నియంత్రణ వ్యవస్థల ఆధునికీకరణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు



తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ...మిగతా 2 లో...

## తాను భారత్ తిరిగి రావడానికి స్ఫూర్తి కలిగించింది ఏమిటో చెప్పిన అభిజీత్ దీప్కే

- షారుఖ్ 'స్వదేశ్' సినిమా చూసి భారత్‌కు తిరిగొచ్చిన దీప్కే
- వందకు పైగా సార్లు ఈ సినిమా చూశానని వెల్లడి
- మహారాష్ట్రలో 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి
- ఈయన నిరసనతోనే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



సినిమాలు కేవలం వినోదాన్ని మాత్రమే కాదు, కొందరి జీవితాల్లో బలమైన స్ఫూర్తిని నింపి, వారి గమనాన్ని నిర్దేశిస్తాయి. సరిగ్గా ఇలాంటి ఓ సంఘటనే కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జీవితంలో చోటుచేసుకుంది. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటించిన 'స్వదేశ్' సినిమా తనను ఎంతగా ప్రభావితం చేసిందో, ప్రజాసేవ వైపు ఎలా నడిపించిందో ఆయన తాజాగా వెల్లడించారు. ...మిగతా 2 లో...

# బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది..

## సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక హామీ ఇచ్చారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒక ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డిలో శనివారం 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, మరో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని, యువత ప్రతిపక్షాల మాయలో పడకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసిన సీఎం, ఇది కేవలం కాగితం ముక్క కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవ కార్డు అని అన్నారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం ఇచ్చి స్కామ్‌లు చేస్తే, తాము సన్నబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. బతుకమ్మ చీరల పేరుతో గతంలో నాసిరకం పంపిణీ చేస్తే, తాము పాలపిట్ట, చిలకపచ్చ రంగు చీరలతో మహిళల గౌరవం పెంచామని తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బాగుపడకూడదని, రాష్ట్రంలో కరువు రావాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు చేతబడులు, అఘోర పూజలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక, తమిళనాడు ఆలయాల్లో అర్ధరాత్రి చేసిన పూజల రహస్యాన్ని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాము మంజూరు చేసిన 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల గ్రామాల్లోనే ఓట్లు అడుగుతామని, బీఆర్ఎస్ వారు కట్టిన డబ్బా ఇళ్ల వద్ద ఓట్లు అడగగలరా? అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. రాహుల్ గాంధీ రాముడైతే, జగ్గారెడ్డి హనుమంతుడని కొనియాడారు. అనంతరం నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు.

# ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్.. కొరియా ద్వీపకల్పంలో

## అసలేం జరుగుతోంది...!

మొదటిపేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చి ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# కల్తీకి చెక్.. తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు..

## ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు

మొదటిపేజీ తరువాయి

ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. 'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

# 'కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసహరించండి'.. రాహుల్ గాంధీకి

## జార్ఖండ్ నిరసనకారులు డిమాండ్...

మొదటిపేజీ తరువాయి

శనివారం దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాంచిలో 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. తమ డిమాండ్లపై స్పందించని సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఆగస్ట్ 20న ముఖ్యమంత్రి నివాసాన్ని మేం ముట్టడిస్తాం. జేఎంఎం, కాంగ్రెస్ రెండూ మాతో రాజకీయాలు చేస్తున్నందున ఆయన రాజీనామాను మేం కోరుతున్నాం. ఒకవేళ ముఖ్యమంత్రి మా మాట వినకపోతే, జేఎంఎం నేతృత్వంలోని కూటమికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఉపసంహరించుకోవాలని కూడా మేము డిమాండ్ చేస్తున్నాం' అని జేపీఎస్సీ-జేఎస్ఎస్సీ రిఫార్మ్ మంచ్ నాయకుడు రవీంద్ర పాశ్వాన్ అన్నారు. కాగా, ఆదివారం 24 జిల్లాలంతటా ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని నిరసనకారులు తెలిపారు. అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్న పరీక్షలను రద్దు చేయడం, నియామక ప్రక్రియపై స్వతంత్ర విచారణ జరుపడం వంటి తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరసనను విరమించబోమని వారు స్పష్టం చేశారు.

# 17 సార్లు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగి.. ఉద్వాసన పలికిన ఏఐ బాస్!

శాన్ ఫ్రాన్సిస్కోలో ఉద్యోగిని తొలగించిన ఏఐ మేనేజర్ 'లూనా'

23 షిఫ్టుల్లో 17 సార్లు ఆలస్యంగా రావడమే కారణమని వెల్లడి

ఏఐతో వ్యాపార నిర్వహణపై 'ఆండన్ ల్యాబ్స్' చేపట్టిన ప్రయోగం

పాలసీని రూపొందించి, దాన్ని అమలు చేయడంలో విఫలమైన ఏఐ

మానవ సిబ్బంది సమీక్షించి, ఏఐ సిఫార్సును ఆమోదించారు

శాన్ ఫ్రాన్సిస్కోలో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడ ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మేనేజర్, తన కింద పనిచేస్తున్న ఉద్యోగిని విధుల నుంచి తొలగించింది. తరచూ ఆలస్యంగా విధులకు హాజరవుతున్నందుకు ఈ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో కార్యాలయాల్లో ఏఐ పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చకు ఈ ఘటన అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే, 'ఆండన్ ల్యాబ్స్' అనే సంస్థ శాన్ ఫ్రాన్సిస్కోలో 'ఆండన్ మార్కెట్' పేరుతో ఒక ప్రయోగాత్మక స్టోర్‌ను నిర్వహిస్తోంది. ఈ స్టోర్ నిర్వహణ బాధ్యతలను 'లూనా' అనే ఏఐ మేనేజర్‌కు అప్పగించింది. వ్యాపారాన్ని ప్రారంభించి, లాభాల్లోకి తీసుకురావాలనే లక్ష్యంతో లూనాకు 1,00,000 డాలర్లు, కార్పొరేట్ కార్డు, ఇంటర్నెట్ యాక్సెస్ వంటి వనరులను సమకూర్చింది. ఉత్పత్తుల ఎంపిక, ధరల నిర్ణయం, బ్రాండింగ్, సిబ్బంది నియామకం వరకు అన్ని బాధ్యతలూ లూనాకే అప్పగించారు. అయితే, ఈ స్టోర్‌లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి 23 షిఫ్టులకు గాను 17 సార్లు ఆలస్యంగా విధులకు హాజరయ్యారు. వాస్తవానికి, హాజరుకు సంబంధించి లూనా ఒక పాలసీని రూపొందించింది. కానీ, దానిని స్థిరంగా అమలు చేయడంలో విఫలమైంది. దీంతో ఆ ఉద్యోగి నెలల తరబడి ఆలస్యంగా వస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన పరిశోధకులు, లూనా రూపొందించిన పాత పాలసీలను సమీక్షించి, ఉద్యోగి పనితీరును అంచనా వేయమని దానికి సూచించారు. అప్పుడు స్పందించిన ఏఐ, ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును మానవ సిబ్బంది సమీక్షించి, తుది నిర్ణయం తీసుకుని ఉద్వాసన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ఘటనపై ఆండన్ ల్యాబ్స్ సీఈఓ లూకాస్ పీటర్సన్ మాట్లాడుతూ, దీనిని అనైతికంగా భావించడం లేదని తెలిపారు. ఒకవేళ మనిషి మేనేజర్‌గా ఉండుంటే ఇంతకంటే ముందే చర్యలు తీసుకునేవారని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏఐలు ఆర్థిక విలువను సృష్టిస్తాయని, కానీ భౌతిక శ్రమ అవసరమైన చోట వాటికి పరిమితులు ఉంటాయని చెప్పడానికి ఈ ప్రయోగం ఒక ఉదాహరణ అని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈ స్టోర్ ఇంకా లాభాల బాట పట్టలేదు. ఐదు నెలల క్రితం 1,00,000 డాలర్లతో ప్రారంభమైన బ్యాంక్ బ్యాలెన్స్, ఇప్పుడు సుమారు 61,186 డాలర్లకు తగ్గింది. ఈ ఘటన ఒకవైపు ఏఐకి పెరుగుతున్న అధికారాలను చూపిస్తూనే, మరోవైపు దీర్ఘకాలిక జ్ఞాపకశక్తి, నిబంధనల అమలులో వాటికున్న పరిమితులను స్పష్టం చేస్తోంది.



# టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

మొదటిపేజీ తరువాయి

నిన్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

# తాను భారత్ తిరిగి రావడానికి స్ఫూర్తి కలిగించింది ఏమిటో చెప్పిన అభిజీత్ దీప్కే

మొదటిపేజీ తరువాయి

ఈ స్ఫూర్తితోనే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన సొంతూరులో 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలలను బాగుచేయండి) అనే ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో ఉన్న తన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా బెంచీలు, తాగునీటి సరఫరా, కిటికీలు, మరుగుదొడ్ల వంటి కనీస వసతుల కొరతను ఆయన ఎత్తిచూపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అనుభవాలను పంచుకున్నారు. "చిన్నప్పటి నుంచి 'స్వదేశ్' సినిమా చూస్తూ పెరిగాను. ఆ సినిమాతో ఎంతగా ప్రేమలో పడ్డానంటే, ఇప్పటికి వందకు పైగా సార్లు చూసి ఉంటాను. అందులోని మోహన్ పాత్ర నన్ను ఎంతగానో కదిలించింది. అమెరికా నుంచి తిరిగొచ్చి సొంత గ్రామ ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనకు ఆ పాత్రే స్ఫూర్తి. సినిమాలో మోహన్, హరిదాస్ అనే వ్యక్తిని కలిసినప్పుడు, అతను కుటుంబాన్ని పోషించడానికి పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోతాడు. తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్‌లో ఓ చిన్న పిల్లవాడు బడికి వెళ్లకుండా నీళ్లు అమ్ముకోవడం చూసి మోహన్ కంటతడి పెడతాడు. ఆ దృశ్యం చూసిన ప్రతిసారీ నా కళ్లలోనూ నీళ్లు తిరిగాయి" అని దీప్కే ఉద్వేగంగా రాసుకొచ్చారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీప్కే చేపట్టిన నిరసన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన ఉద్యమ తీవ్రతకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇప్పుడు 'జంతర్ మంతర్ సీజన్ 2'లో భాగంగా దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని చేపట్టారు. అమెరికా నుంచి తిరిగొచ్చి, సినిమాలోని మోహన్ పాత్రలాగే తన సొంత గ్రామానికి సేవ చేసే అవకాశం రావడం జీవితంలో ఒక వలయం పూర్తి కావడమేనని దీప్కే పేర్కొన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని, అర్థవంతమైన మార్పు కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

మొదటిపేజీ తరువాయి

పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం: బీజేపీ ఎంపీ అరవింద్‌కు కాంగ్రెస్ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అరవింద్ తన నోటి దురుసును అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ఎన్ఎస్‌యూఐ స్థాయి నుంచి కష్టపడి పైకొచ్చిన బీసీ బిడ్డ మహేశ్ కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదని మండిపడ్డారు. తండ్రి పేరును వాడుకుని రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్, స్వయంకృషితో ఎదిగిన నాయకులను విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు ఎక్కడ తెచ్చారో, గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఏం చేశారో అరవింద్ స్పష్టం చేయాలని అనిల్ డిమాండ్ చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుంటే, అరవింద్ కేవలం విమర్శలు చేయడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. డీఎస్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. సాయికుమార్ మాట్లాడుతూ, అరవింద్ మాటలు మద్యం దుకాణాల వద్ద తాగుబోతుల మాట్లాడే తీరులో ఉన్నాయని విమర్శించారు. దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి కౌన్సిలర్‌గా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. "ఇంకోసారి హద్దు మీరితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతాం" అని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తన పార్టీ నాయకులను అదుపులో ఉంచుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు.

# నేటి ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలి...

దేవరకద్ర, ఆగస్టు 16 ప్రజా విక్షణం



మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. మండల పరిధిలోగల అన్ని శాఖల అధికారులు ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి రావాలని సూచించారు. శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజావాణి కార్యక్రమం పట్ల నిర్లక్ష్యం చేసే అధికా రులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు.

# బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత సర్దార్ గౌతు లచ్చన్న

## బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

## బాపట్లలో గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు బాపట్ల :

ఆగస్టు 16 ( ప్రజా వీక్షణం )

స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత సర్దార్ గౌతు లచ్చన్న గారి 117వ జయంతి వేడుకల్లో బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు .బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డులో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద బీసీ వెల్ఫేర్ అసోసియేషన్, బాపట్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొని, లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ..... స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల గొంతుకగా సర్దార్ గౌతు లచ్చన్న గారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన ధైర్యశాలి లచ్చన్న గారని కొనియాడారు.అంటరానితనం, కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పిం చేందుకు ఆయన విశేష కృషి చేశారని చెప్పారు.రాజకీయ పదవులను అధికా రానికి మార్గంగా కాకుండా ప్రజాసేవకు సాధనంగా భావించిన గొప్ప ప్రజానాయకుడు లచ్చన్న గారని, 95 ఏళ్ల వయస్సులోనూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల కోసం సేవ చేసిన మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వ ం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిం చడం ద్వారా ఆయన సేవలకు, ఆశయాలకు ఇస్తున్న గౌరవాన్ని చాటుతోందని అన్నారు.బాపట్లలో లచ్చన్న జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా, ఆయన చరిత్రను భావితరాలకు పరిచయం చేసేలా ప్రతి సంవత్సరం జయంతి కార్యక్రమాలను నిర్వహించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు అన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే లచ్చన్నకి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో బాపట్ల నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తాత జయప్రకాశ్ నారాయణ , రమేష్, దగ్గుమల్లి రాణి,



రామారావు, బాల కోటేశ్వరరావు, కృష్ణ, శేఖర్, చినబాబు, వెంకట నారాయణ, చలమయ్య, మురళి తదితర బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న పట్టణ సీఐను అభినందించిన రావు సుబ్రహ్మణ్యం

చిలకలూరిపేట : ఆగష్టు 16 ( ప్రజా వీక్షణం )



ఉత్తమ పోలీస్ అవార్డు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా అందుకున్న చిలకలూరిపేట పట్టణ సీఐ పి రమేష్ బాబు ను నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం అభినందించారు .ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ లో కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు,జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ,అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ సమక్షంలో అవార్డు స్వాతంత్ర్య దినోత్సవం సందర్బంగా అందుకోవడం పట్టణానికి గర్వకార ణం అన్నారు.వాలంటరీ సేవలు అందిస్తున్న రావు శ్రీకృష్ణదేవరా యలు శుభాకాంక్షలు తెలిపారు.

# కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ కు జలకళ ..

## నీటిమట్టం 18 అడుగులు..

దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం




జిల్లాలోని మధ్య తరహా భారీ ప్రాజెక్టు అయిన కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు జూరాల నుంచి నీరు రావడంతో ఆదివారం సాయంత్రం నాటికి కోయిల్ సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 18 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతుంది. గత 15 రోజుల నుంచి జూరాల బ్యాక్ వాటర్ నీటిని విడుదల చేయడంతో కోయిల్ సాగర్ ప్రాజెక్టులోకి రోజురోజు నీరు వచ్చి చేరుతుంది. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం. 32.5 అడుగులు కాగా ప్రస్తుత నీటి నిల్వ 18 అడుగులకు చేరింది. మరో 14 అడుగుల వద్ద నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతుంది.. ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంతో ఆయకట్టు దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు సాగు చేసుకున్న పంటలకు నీరు వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నందిగామలో జోరుగా 'డ్రగ్స్‌పై దండయాత్ర' ర్యాలీ!

## యువతను రక్షించడమే లక్ష్యంగా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

నందిగామ, ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)

యువతను మత్తు పదార్థాల మహమ్మారి బారి నుంచి కాపాడటమే ధ్యేయంగా నందిగామ పట్టణంలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' అవగాహన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్ఎంపీ డాక్టర్ల ఆధ్వర్యంలో ఈ అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ బజార్ మీదుగా ఉత్సాహభరితంగా సాగింది. ర్యాలీలో పాల్గొన్నవారంతా "డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు" అంటూ చేసిన బిగ్గర నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి.?ఈ కార్యక్రమంలో ఎస్సై మహతి, ఎస్సై సూర్యవంశీ, ట్రాఫిక్ ఎస్సై నరేష్, ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాసరావులతో పాటు పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది మరియు ఆర్ఎంపీ డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల కలిగే భయంకరమైన దుష్ప్రభావాలు, యువత జీవితాలు ఏ విధంగా నాశనమవుతున్నాయనే విషయాలపై ప్రజలకు సమగ్రంగా వివరిస్తూ చైతన్యం కల్పించారు. భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించే దిశగా అందరూ ఐక్యంగా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేకూర్చేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీస్ యంత్రాంగాన్ని, ఆర్ఎంపీ డాక్టర్ల బృందాన్ని స్థానిక ప్రజలు విశేషంగా అభినందించారు.



# నేటి నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు..

దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా విక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి తొమ్మిదో వార్షికోత్సవ ఉత్సవాలను ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు కల్వ కన్నయ్య శెట్టి, ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. 17న వేద పారాయణం గోపూజ యాగశాల ప్రవేశము గణపతి పూజ పుణ్యావచనము అఖండ దీప స్థాపన నవకలశ స్థాపన అలాగే ధ్వజ రోహణం, 18న గవ్యంత పూజలు వాస్తుపూజ వాస్తు హోమము 19 న ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్టా పన గోదర్శనము శాంతి కళ్యాణం నిర్వహించడం జరుగుతుం దని ఆయన తెలిపారు.మూడు రోజుల



పాటు ఉత్సవ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. దీంతో ఆలయాన్ని రంగుర ంగుల విద్యుత్ దీపాలతో రంగురం గులతో తీర్చిదిది అలంకరిం చారు. మూడు రోజులపాటు ఆలయ ఆవరణంలో ప్రతిరోటు ప్రత్యేక పూజలు అభిషేకాలు వంటి పూజా కార్యక్రమంలో ఘనంగా జరుపుకుం టున్నట్లు ఆయన తెలిపారు. ఈ వార్షికోత్సవాలలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అందరూ తప్పకుండా హాజరై ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# కే.గోకవరం, పాత్యానగరం గ్రామాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పర్యటన..





## బాధిత కుటుంబాలకు ఘన భరోసా

లింగంపాలెం:ఆగష్టు 16(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం లోని పాత్యానగరం, కే.గోకవరం గ్రామాల్లో శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పర్యటించి, పలువురు బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. కష్టకాల ంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.పాత్య నగరం గ్రామంలో సొంగా ఏసు సతీమణి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులు అర్పిం చారు. అనంతరం కే.గోకవరం గ్రామంలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి స్వగ్రామానికి వచ్చిన మందలపు నరసింహారావును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.అదే గ్రామంలో సతీమణిని కోల్పోయిన ఎలమంచి రామచంద్ర రావు కుటుంబాన్ని, తండ్రి మొగళ్ళ వెంకటేశ్వరావును కోల్పోయిన మొగళ్ల సత్తిబాబు కుటుంబాన్ని, అలాగే సతీమ ణిని కోల్పోయిన ఎలమంచి సాయి బాబు మరియు వారి కుటుంబ సభ్యులను విడివిడిగా పరామర్శించి ఓదార్చారు. వారికి తగిన మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో పలువు రు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నైనా ప్రజల వెంటే ఉంటూ అందుబా టులో ఉంటామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ స్పష్టం చేశారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# బాపట్లలో ఉత్సాహంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ బహుమతి ప్రధానోత్సవం..






## విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోల అందజేత!

**బాపట్ల : ఆగష్టు 16 ( ప్రజా వీక్షణం )**

బాపట్లలోని ఏకో హౌస్ వేదికగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వ ర్యంలో మండల, పట్టణ పరిధిలో ని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వ హించిన వ్యాసరచన, చిత్రలేఖ నం,డిబేట్ మరియు ఉపన్యాస పోటీల విజేతలకు ఘనంగా బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు గురజాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్ బోస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక తను, పోటీ తత్త్వాన్ని పెంపొందిం చడంతో పాటు తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు భాగస్వాములమై పిల్లల్లో దేశభక్తి, క్రమశిక్షణ,మానవతా దృక్ప థాన్ని అలవర్చాలని పిలుపుని చ్చారు.దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ,త్రివర్ణ పతాక ప్రాముఖ్యతను చాటేలా నిర్వహించిన ఈ పోటీలకు పట్టణ,గ్రామీణ ప్రాంతాల నుండి సుమారు 124 మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. 2047 నాటికి భారతదేశం ఎలా ఉండాలనే అంశం పై, హక్కులకంటే బాధ్యతల ప్రాధాన్య తపై విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ముత్తయ్యపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి కర్రీ జస్వంత్ "గాంధీ గెటప్"లో అందరినీ ఆకట్టుకుని ప్రత్యేక బహుమతి అందుకున్నారు .బత్తుల వెంకట సుబ్బమ్మ & కృష్ణవ ూర్తి మెమో రియల్ ట్రస్ట్ సహ కారంతో జరిగిన ఈ వేడుకలో విజే తలకు అతిథులు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేసి అభినంది ంచారు.పోటీలలో వివిధ విభాగాల విజేతల వివరాలు చూస్తే, తెలుగు ఉపన్యాస పోటీల ప్రైవేట్ పాఠశాలల సబ్–జూనియర్స్ విభా గంలో పి.వెన్నెల మొదటి స్థానంలో, కె.యజ్ఞ విరాజ్ రెండవ స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో ఎస్కే. తమీన్ అహ్మద్ మొదటి స్థానంలో,వి.సాహితి శ్రీ రెండవ స్థానంలో ఉన్నారు. సబ్–సీనియర్స్ విభాగంలో ఎన్.వేణు తేజ మొదటి స్థానాన్ని,పివిడిఎస్ కైలాష్ రెండవ స్థానాన్ని దక్కించుకో గా,సీనియర్స్ విభాగంలో ఎం.అజిత్ గౌర్ మొదటి స్థానంలో,సిహెచ్. భవ్య సబరన్ రెండవ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్ ఉపన్యాస పోటీల ప్రైవేట్ పాఠశాలల సబ్–జూనియర్స్ విభా గంలో బి. నిరోష మొదటి స్థానంలో, ఎస్డీ. దిలేర్ రెండవ స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో బి.తనుజ మొదటి స్థానం, డి.సోఫ్మి రాచెల్ రెండవ స్థానం సాధించారు. సబ్–సీనియర్స్ విభాగంలో జి. ప్రహర్షిత మొదటి స్థానంలో, జి. చక్రిత రెండవ స్థానంలో నిలిచారు. సీనియర్స్ విభాగంలో సిహెచ్. భార్గవ్ సాయినాథ్ మొదటి స్థానం, కె. భవ్య రెండవ స్థానం కైవసం చేసుకున్నారు .ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ విభాగంలో జె.అక్షయ ప్రియ మొదటి స్థానంలో, కె.హద్దస రాణి రెండవ స్థానంలో నిలిచారు. తెలుగు సబ్–సీనియర్స్ విభాగంలో పి. సంజుప్రియ మొదటి స్థానం, జె. శ్రీలక్ష్మి రెండవ స్థానం పొందగా, సీనియర్స్ విభా గంలో ఆనన్ మొదటి స్థానంలో,శ్రీలక్ష్మి రెండవ స్థానంలో నిలిచారు.ఈ కార్యక్ర మంలో సంస్థ వైస్ చైర్మన్ జి.శాంతా రామ్,ప్రధాన కార్యదర్శి వి.జోత్స్న, డైరెక్టర్లు వంకాయలపాటి హరిబాబు, కోలా సుబ్బారావు, తోట రామాంజ నేయులు, డాక్టర్ పంగులూరి హరిప్ర సాద్, పుత్తూరు సుభాషిని శ్రీనివాస్, మహిళా సమైక్య అధ్యక్షురాలు కోలా పద్మజ, కర్ణం రవీంద్రబాబు,ట్రెజరర్ షబీర, సి.హెచ్. కేశవులు, డాక్టర్ బైరాపట్నం సింగారావు, ఎం.ఆర్.కె. శర్మ,జ్యోతిర్మ యి, భవనం బసిరెడ్డి ,కొటికలపూడి స్వరాజ్యలక్ష్మి,కార్తీక్, సుప్రజ తదితరుల తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# నెలకు రూ.70 వేల సిప్.. 24 ఏళ్లలో రూ.11 కోట్లు.. కాంపౌండింగ్ అద్భుతం అంటే ఇదే!

**క్రమానుగత పెట్టుబడితో దీర్ఘకాలంలో భారీ సంపద సృష్టి**

**మొదట్లో నెమ్మదిగా, తర్వాత వేగంగా పెరిగే కాంపౌండింగ్ రాబడి**

**మొదటి కోటికి 8 ఏళ్లు, చివరి కోటికి కేవలం 10 నెలల సమయం**

**పెట్టుబడిలో ఓపికే ప్రధానం, మధ్యలో ఆపితే భారీ నష్టం**

**మీ డబ్బు మీకంటే ఎక్కువగా సంపాదించే దశకు చేరడమే లక్ష్యం**

ప్రతి నెలా క్రమం తప్పకుండా చేసే చిన్న పొదుపు, దీర్ఘకాలంలో ఎంత పెద్ద సంపదను సృష్టిస్తుందో చాలామందికి అవగాహన ఉండదు. క్రమానుగత పెట్టుబడి విధానం లో ఉన్న అద్భుతమైన శక్తి 'కాంపౌండింగ్'. దీనినే చక్రవడ్డీ ప్రభావం అని కూడా అంటారు. పెట్టుబడి ప్రయాణం ప్రారంభంలో నెమ్మదిగా కనిపించినా, కాలం గడిచేకొద్దీ సంపద సృష్టిలో దీని వేగం చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. దీనిని అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణను పరిశీలిద్దాం.ఫండ్స్ఇండియా రీసెర్చ్ అందించిన ఒక నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి నెలకు రూ.70,000 చొప్పున ఒక సిప్‌లో పెట్టుబడి పెడుతూ, దానికి వార్షికంగా సగటున 12 శాతం రాబడి వస్తుందని అనుకుందాం. ఈ లెక్కన అతని పోర్ట్‌ఫోలియో విలువ రూ.11 కోట్లకు చేరడానికి సుమారు 23 సంవత్సరాల 8 నెలల సమయం పడుతుంది. అయితే ఈ ప్రయాణంలో అసలు మ్యాజిక్ చివర్లోనే ఉంటుంది.మొదట్లో నెమ్మదిగా... ఆ తర్వాత వేగంగాఈ ఉదాహరణను విశ్లేషిస్తే, సంపద సృష్టిలో కాంపౌండింగ్ పాత్ర స్పష్టంగా అర్థమవుతుంది.మొదటి రూ.1.1 కోట్లు సమకూరడానికి దాదాపు 8 ఏళ్లు పట్టింది. ఈ మొత్తంలో 60 శాతం పెట్టుబడిదారుడి సొంత డబ్బే కాగా, 40 శాతం మాత్రమే రాబడి ద్వారా వచ్చింది.కానీ, పోర్ట్‌ఫోలియో విలువ రూ.9.9 కోట్ల నుంచి రూ.11 కోట్లకు చేరడానికి (అంటే చివరి రూ.1.1 కోట్లకు) కేవలం 10 నెలల సమయం మాత్రమే పట్టింది. ఈ పెరుగుదలలో 94 శాతం కేవలం రాబడి నుంచే రావడం విశేషం. పెట్టుబడిదారుడి సొంత డబ్బు కేవలం 6 శాతం మాత్రమే.దీనిని నిపుణులు సరదాగా "8-4-3 నియమం" అని కూడా పిలుస్తారు. మొదటి రూ.1.1 కోట్లకు 8 ఏళ్లు, తర్వాతి కోటికి 4 ఏళ్లు, ఆ తర్వాతి కోటికి 3 ఏళ్లు పడుతుంది. సుమారు 20 ఏళ్లు దాటిన తర్వాత, అదే సిప్ కొనసాగిస్తే దాదాపు ప్రతి ఏటా ఒక కోటి రూపాయలు పోర్ట్‌ఫోలియోకు జతవుతూ ఉంటుంది.ఓపికే అత్యంత ముఖ్యంఈ ఉదాహరణ చెప్పే ప్రధాన నీతి ఒక్కటే - దీర్ఘకాలిక పెట్టుబడులలో అసహనం అతిపెద్ద శత్రువు. చాలా మంది పెట్టుబడిదారులు కాంపౌండింగ్ వేగం పుంజుకునే దశకు ముందే తమ సిప్‌లను ఆపేస్తుంటారు. మార్కెట్‌ను టైమింగ్ చేయడం కంటే, మార్కెట్లో ఎక్కువ కాలం కొనసాగడమే ముఖ్యమని ఇది రుజువు చేస్తోంది. మొదట్లో మన డబ్బు కష్టపడితే, దీర్ఘకాలంలో మన డబ్బు మన కోసం ఇంకా కష్టపడి పనిచేస్తుంది.గమనిక: ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. మార్కెట్ రాబడులు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. పన్నులు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు కూడా రాబడిపై ప్రభావం చూపుతాయి. ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు మీ రిస్క్ సామర్థ్యాన్ని అంచనా వేసుకొని, ఆర్థిక సలహాదారుడిని సంప్రదించడం శ్రేయస్కరం.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కూతురుఆల ప్రీతి రెడ్డి..

**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం**

దేవరకద్ర నియోజకవర్గం లో చిన్న చింతకుంట మండల పరిధిలోని దమగ్నపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కావలి పరుషరామ్ రేవతి గార్ల వివాహానికి ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి కూతురు ఆల ప్రీతి రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించరు. ఈ కార్యక్రమాలలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మంత్రిని సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి..

**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం**

దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో చిన్న చింతకుంట మండల పరిధిలోని పల్లమా రి గ్రామంలో ని ఎన్నగుట్ట వద్ద ఆదివారం ఏ టి సి కాలేజీ భూమి పూజ చేయడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సమక్షంలో దేవరకద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు.



# నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న తిరువీధుల

**బాపట్ల : ఆగష్టు 16 ( ప్రజా వీక్షణం )**

ఆదివారం గుంటూరు నగరంలోని గీతా కేఫ్ హోటల్ లో జరిగిన బాపట్ల వాస్తవ్యులు జంపని మురళి,పద్మ ల కుమార్తె మరియు విజయవాడ గుణదల వాస్తవ్యులు ఏకుల నాగరాజు కుమారుడి నిశ్చితార్థంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు,యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పాల్గొని,పుష్ప గుచ్ఛంతో వధూవరులను ఆశీర్వదించారు.



# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..

**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం**

హైదరాబాద్ లో దేవరకద్ర మండల పరిధిలోని బస్వాయపల్లి గ్రామానికి చెందిన ఏదుల చంద్రశేఖర్ అడ్వకేట్ చెల్లెలు శ్యామల బాలశివుడు కూతురు భవ్య వివాహ వేడుకలు ఆదివారం జరిగింది. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి, పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినరు. నూతన దంపతుల జీవన దంపత్యము నిండు నూరేళ్లపాటు కొనసాలని మనసారా కోరుకుంటూ వారిని ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ఖదీర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనలో నెరవేరుతున్న సొంతింటి కలలు..

**జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావ్ తో కలసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్..**

**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వి క్షణం**

నియోజకవర్గం లో కౌకుంట్ల మండల కేంద్రంలో గుడిసె పార్వతమ్మ కృష్ణయ్య ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు తో కలిసి కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్, ఆదివారం గృహప్రవేశం చేయడం జరిగింది. పూరిగుడిసెల్లో కాలం వెళ్లదీసి న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మం జూరు కావడంతో ఎన్నో ఏళ్ల సొంతింటి కల నెరవేరిందంటూ ఆత్మగౌరవంతో బ్రతికేలా సొంత ఇల్లు ఇచ్చి ఎలాంటి పైరవీలకు తావు లేకుండా లబ్ధిదారుల అకౌంట్లో నేరుగా డబ్బులు వేస్తూ ఇల్లు మంజూరు చేసిన దేవరకద్ర శాసన సభ్యులు జి, మధుసూదన్ రెడ్డి,కి కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పెద్దలు బడుగుల రామచంద్రా రెడ్డి ,మండల ఓబీసీ అధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బెందుల ప్రభు, ఉప సర్పంచ్ లక్ష్మీకాంత రావ్, వార్డు సభ్యులు బంటు నాగన్న, శాంతం రవీందర్ రెడ్డి , కావాలి లక్ష్మణ్ , మరియు కరెంటు నరసింహా , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.







# విద్య అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట.






## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి..



**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా విక్షణం**

విద్య అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారము దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో చిన్న చింతకుంట మండల పరిధిలోని నెల్లికొండి పల్లమరి గ్రామాల మధ్యలో ఉన్న ఎర్రగుట్ట వద్ద 44 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఏ టి సి కాలేజీ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో దానిని అందుబాటులోకి తీసుకొని రావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదువుకొని అటు తల్లిదండ్రులకు నియోజకవర్గ ప్రజలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. విద్య అభివృద్ధి కోసం మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. విద్య అభివృద్ధికై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంతో శ్రద్ధ తీసుకొని పెద్దపీట వేయడం జరుగుతుందని ఆయన అన్నారు. మారుమూల గ్రామంలో ఏటీసీ కాలేజీ నిర్మాణం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయము అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, టీ పిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మండల పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆశీస్సులతో ప్రజాసేవకు మరింత అంకితం

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తన పుట్టినరోజును పురస్కరించుకుని సతీమణి అనురాధతో కలిసి తిరుమలలో కొలువైన కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వారిని ఆదివారం దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ పండితులు, వేద పండితుల ఆశీర్వచనాలు బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు తీసుకున్నారు. పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని శ్రీవారిని వేడుకున్నట్టు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన పుట్టిన రోజునే కలియుగా దైవమైన శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు తన కుటుంబ సభ్యులాంటివారని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయడమే తన ధ్యేయమని చెప్పారు. శ్రీవారి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# కొనసాగుతున్న అఖండ భజన..

**దేవరకద్ర. ఆగస్టు 16 ప్రజా విక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా అఖండ దీపారాధన, మరియు భజన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో ప్రతి సంవత్సరం స్వామివారి ఆలయంలో 41 రోజులపాటు అఖండ దీపారాధన పెట్టడం అనావాతిగా వస్తున్నది అని అర్చకులు తెలిపారు. దీపారాధన భజన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే శ్రావణమాసం నాల్గవ రోజు ఆదివారం రాత్రి ఆలయంలో శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అలంకరణ వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి . ఆలయంలో అఖండ దీపారాధన వెలిగించరు. భజన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ దేవస్థానం ఈవో శివానంద చారి, అర్చకులు నాగరాజు, నాగభూషణ్ , భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పాపన్న విగ్రహావిష్కరణకు పాలమూరు నుంచి భారీగా తరలిరావాలి...

## ఈ నెల 18న సీఎంతో ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ..

## గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్ కుమార్ గౌడ్ పిలుపు

**దేవరకద్ర ,ఆగస్ట్ 16 ప్రజా విక్షణం**

హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి బహుజనులు, బీసీలు, గౌడ సామాజిక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వాములు కావాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాటమయ్య దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన పాపన్న గౌడ్ 21 కోటలను జయించి గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 18న ఉదయం ఆయా మండలాల్లో జయంతి వేడుకలు నిర్వహించుకుని, మధ్యాహ్నం 12 గంటల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి ట్యాంక్‌బండ్‌కు చేరుకోవాలని సూచించారు. సొసైటీ సభ్యులు, టీఎఫ్‌టీ లైసెన్స్‌దారులు, గీత కార్మికులు, గౌడ ఉద్యోగులు, పెన్షనర్లు, గౌడ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లన్న, గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సాయిల్ గౌడ్, నాయకులు రమేష్ గౌడ్, రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతులు చేపట్టిన సర్పంచ్....

**సిర్పూర్ కాగజనగర్ ప్రతి నిధి : ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజనగర్ మండలం వంజిరి గ్రామ పంచాయతీ పరిధిలోని నందిగూడ, సీఆర్ నగర్, సీఆర్ నగర్--వంజిరి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గ్రామ సర్పంచ్ గౌత్రే లక్ష్మీ, (గోపాల్ ) ఉపసర్పంచ్ భరత్, ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు. గుంతలను మొరం, కాంక్రీట్‌తో పూడ్చి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిని ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ మరమ్మతు పనుల్లో ఉప సర్పంచ్ భరత్, వార్డు సభ్యులు కార్తీక్, లింగయ్య, రమేష్, పద్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# జై హింద్ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం:...

# పేదలకు ఆర్మీ డాక్టర్ దంపతుల సేవల ఘన విజయం

**నందిగామ, ఆగస్టు 16 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో "మానవసేవే మాధవసేవ" నినాదంతో పేద ప్రజలకు ప్రాణదాతగా నిలుస్తున్న జై హింద్ హాస్పిటల్ మొదటి సంవత్సర వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దేశసేవలో ఆర్మీ డాక్టర్‌గా తరించి, విశ్రాంతి అనంతరం సామాన్యులకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆసుపత్రిని స్థాపించిన మేజర్ డాక్టర్ యశ్వంత్ మరియు డాక్టర్ ఆశం భావన దంపతుల సేవలు నందిగామ ప్రాంత ప్రజలకు వరంగా మారాయి. ఆర్మీలో నేర్చుకున్న క్రమశిక్షణ, సేవాభావాన్ని ప్రజలకు అందిస్తున్నామని, డబ్బులు లేక పేద ప్రజలు వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆసుపత్రిని స్థాపించినట్లు మేజర్ డాక్టర్ యశ్వంత్ తెలిపారు. గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, వృద్ధుల కోసం ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందిస్తూ, ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, రాత్రి పూట కూడా డాక్టర్లు అందుబాటులో ఉండేలా 24/7 అత్యవసర సేవలు అందిస్తున్నామని డాక్టర్ ఆశం భావన తెలిపారు. గత ఏడాది కాలంలో జై హింద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల 12 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 3,000 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పేద రోగులకు ఆపరేషన్లు, మందులు మరియు స్కానింగ్‌లలో 50 శాతం రాయితీ కల్పించారు. అలాగే పాఠశాలలు, కాలేజీలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు, శుభ్రమైన వాతావరణం, స్నేహపూర్వక సిబ్బంది ఉండటంతో నందిగామ చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు ఇక్కడికి వైద్యం కోసం వస్తున్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పేద రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా రక్తదాన శిబిరం నిర్వహించగా 50 మంది యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేని తమకు జై హింద్ హాస్పిటల్ దేవుడిలా ఆదుకుందని, మేజర్ డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ఆశం భావన తమ కోసం ఎంతగానో కష్టపడుతున్నారని స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఈ ఆసుపత్రిని మరింత విస్తరించి మరిన్ని ప్రత్యేక విభాగాలను ప్రారంభించాలని డాక్టర్ దంపతులు నిర్ణయించారు. మార్కెటింగ్ మేనేజర్ అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు, వైద్యులు మరియు నందిగామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసుపత్రి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.







ప్రజావీక్షణం

దినపత్రిక

# వరంగల్ గడ్డ చరిత్ర, పోరాట స్ఫూర్తికి ప్రతీక






## నిరుపేదల సంక్షేమం కోసం ఇచ్చిన ప్రతి మాట ను నిలబెట్టుకుంటాం

## అన్ని వర్గాల కు సామాజిక న్యాయం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం సీఎం రేవంత్‌రెడ్డి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ గడ్డకు గొప్ప చరిత్ర, పోరాట స్ఫూర్తి, ప్రజా చైతన్యం ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా సమ స్యలపై ప్రశ్నించే, పోరాడే చైతన్యం వరంగల్ ప్రజల సొంతమని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లా పరకాలలో ఆదివారం నిర్వ హించిన ప్రజాపాలన-- ప్రగతి బాట విజయోత్సవ సభలో సీఎం ముఖ్య అతి థిగా పాల్గొని ప్రసంగించా రు. అంత కుముందు దాదా పు రూ.484 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనుల కు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.కాకతీయుల ఘన చరిత్ర, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కి వరంగల్ ప్రాంతం ప్రతీక గా నిలిచిందని సీఎం అన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్, దాశరథి వంటి మహనీయులు ప్రజల కోసం జీవితాలను అంకి తం చేశారని గుర్తుచేశారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు సేవకులు గా పనిచేయాలని, ప్రజల చైతన్యమే ప్రజా స్వామ్యా నికి బలమని అన్నారు.గత ప్రభుత్వం భారీ అప్పుల భారం మిగిల్చినప్పటికీ రైతులు, మహిళలు, పేద లు, యువత, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభు త్వం అత్యధిక ప్రాధా న్యం ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచి త విద్యుత్, రైతు రుణమా ఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.మహిళల ఆర్థిక సాధికార త కోసం స్వయం సహాయ క సంఘాలను బలోపేతం చేస్తూ పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పి స్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 8 వేల గ్రామా ల్లో ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల ఏర్పాటుకు చర్య లు చేపడుతున్నట్లు వెల్ల డించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పించేందుకు ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశామని సీఎం తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు, పేదలు, అణగారిన వర్గాల కు రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పిం చడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. వరంగల్ అభివృద్ధి కి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీ య మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్ట రీ, మామునూరు విమానా శ్రయం వంటి కీలక ప్రాజెక్టు లను ముందుకు తీసు కెళ్తున్నామని సీఎం తెలి పారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతూ పేదల సంక్షేమం తో పాటు అభి వృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మామునూరు విమానాశ్ర యానికి భూసేకరణ కోసం రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, రాబో యే రెండేళ్లలో విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగు తున్నాయని తెలిపారు. వరంగల్ కు సుమారు రూ. 5,700 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయ నున్నట్లు చెప్పారు. రూ.6,000 కోట్లకు పైగా వ్యయంతో కొనసాగుతు న్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తా మన్నారు.

### ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్

మాట్లాడుతూ 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపి ణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 43 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలి పారు.

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మాట్లాడుతూ వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మామునూరు విమానాశ్ర యం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజె క్టులు ఇందుకు నిదర్శనమ న్నారు.

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మాట్లాడుతూ పరకాలకు గొప్ప పోరాట చరిత్ర ఉంద న్నారు. 1947 సెప్టెంబర్ 2న జరిగిన పోరాటంలో అమరులైన 25 మంది స్వాతంత్ర్య సమరయో ధుల త్యాగాలను స్మరిం చారు.



పర కాల అమరధా మాన్ని అభివృద్ధి చేసి ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిది ద్దాలని సీఎంను కోరారు. పరకాలకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండి యా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 100 పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారం భించడం గర్వకారణమ న్నారు. పరకాల ఇందిరా మహిళా డెయిరీని విస్తరిం చి 40 వేల కుటుం బాలకు ప్రయోజనం చేకూర్చేలా కృషి చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదు గా రూ.10 కోట్ల చెక్కును అందజేశారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సీఎం రేవంత్‌రెడ్డికి భద్రకాళి అమ్మవారి ఆల యం, కాకతీయ కళాతోర ణం ప్రతిరూపాలతో కూడి న జ్ఞాపికను అందజేశారు.కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, ప్రజాప్రతిని ధులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఏ టీసీల లక్ష్యం..

## మంత్రి ఎమ్మెల్యే

**దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం**

యువతకు ఉపాధి అవకాశం కల్పించడమే ఏ టి సి ముఖ్య ఉద్దేశమని దీనివల్ల యువతకు ఉపాధి అవకాశం కల్పించినట్లు అవుతుందని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారము నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోని నెల్లికొండి పల్లమారి మధ్యలో ఉన్న ఎర్రగుట్ట వద్ద 44 కోట్లతో నిర్మించిన ఏ టి సి కళాశాల నిర్మాణానికి మంత్రి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, నిరుద్యోగ యువత హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా మన ప్రాంతంలోనే నైపుణ్య శిక్షణ పొందే అవకాశం ఏటీసీ ఏర్పాటు వల్ల కలుగుతుందని అన్నారు.మన తెలంగాణ యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే కేవలం చదువు మాత్రమే కాకుండా ఇండస్ట్రీకి అవసరమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు కూడా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఐటిఐ లను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసిందన్నారు.టాటా టెక్నాలజీస్ సహకారంతో అంతర్జాతీయ టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కేంద్రాల్లో 6 కొత్త టెక్నాలజీ ఆధారిత కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు.ఏటీసీ లలో ప్రపంచ స్థాయి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను బోధించడం వల్ల ప్రముఖ కంపెనీలు నేరుగా ఏటీసీ క్యాంపస్‌లకు వచ్చి ఉద్యోగాలు ఇస్తున్నాయని, ఇట్టి అవకాశాన్ని మన ప్రాంత యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ముఖ్యంగా గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్య పరంగా కనీసం నియోజకవర్గంలో ఒక్క డిగ్రీ కాలేజ్ కూడా ఏర్పాటు చేయలేదని, మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేశామని అన్నారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వైద్యం పరంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆసుపత్రులు తప్ప ఒక్క హాస్పటల్ కూడా కొత్తగా నిర్మించలేదని, మన ప్రజా ప్రభుత్వం దేవరకద్రలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఆరు నెలలలో దేవరకద్ర లో హాస్పిటల్ నిర్మాణం పూర్తవుతుందన్నారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ పరంగా చేసిందేమీ లేదని, కనీసం కోయిల్ సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయలేదని, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోయిల్ సాగర్ పెండింగ్ పనులకు 93 కోట్ల రూపాయలు నిధులు, అజిలాపూర్ లిఫ్ట్ కు 32 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గం యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో అహర్నిశలు పని చేస్తున్నామని, అందులో భాగంగా ప్రతిష్టాత్మకమైన బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ను దేవరకద్రకు తీసుకువచ్చామని, ఇప్పటికే టీజీఐ ఐ సి భూమిని సేకరించిందని తెలిపారు.భూత్పూర్ మండలంలోని కరివేన వద్ద మిధాని రెండో యూనిట్ ఏర్పాటు చేయబోతుందని, నియోజకవర్గ ప్రజలకు శుభవార్త తెలియజేసారు.అలాగే దేవరకద్ర నియోజకవర్గంలో రెండు స్కిల్ డెవలప్మెంట్ లను ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో బీడీ కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ముఖ్యంగా చిన్నచింతకుంట మండలంలో పెద్ద ఎత్తున బీడీ కార్మికులు ఉన్నారని, నియోజకవర్గంలో బీడీ కార్మికుల కోసం మూడు డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా నియోజకవర్గంలో జాబ్ మేళా సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా మంత్రి స్పందించారు.తదనంతరం మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.యువత ఉజ్వల భవిష్యత్తు కోసం







రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందన్నారు, ఇచ్చిన మాట ప్రకారం, రెండేళ్లలో 2 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా ఇప్పటికే లక్ష ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. యువతను నైపుణ్యాభివృద్ధిలో తీర్చిదిద్దేందుకు 4000 వేల కోట్లతో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏటీసీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు, అందులో ఇప్పటికే 65 ఏటిసి సెంటర్లు ప్రారంభించామని తెలిపారు.కేవలం స్థానికంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలోనూ మన యువత రాణించేలా నిర్ణయం తీసుకుని, టామ్ కామ్ ద్వారా విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, ఇటలీ, జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో డిమాండ్ ఉన్న ఆయా విదేశీ భాషలను ప్రభుత్వమే స్వయంగా నేర్పిస్తోందన్నారు.విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని, విదేశీ భాషలు నేర్చుకుని, 25 లక్షల వేతనాన్ని పొందాలని ఈ సందర్భంగా మంత్రి యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, టిపిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు అధికారులు పార్టీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# రూప్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వడ్డీ రఘురాం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన గుండుగోలు రూప్ కుమార్ చేతికి గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ఆయనను ఆదివారం పరామర్శించారు. రూప్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

## తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని పట్టణంలోని 28వ వార్డులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి), స్థానిక తెదేపా నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, ఎస్‌కే బాజీ, పసలపూడి రాంబాబు, బిరుదుకోట వెంకటేశ్వరరావు, అమలాపురపు వెంకన్న, పిన్నింటి దుర్గారావు, ఎస్‌కే మీరా, ఎస్‌కే భాషతో పాటు వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నందిగామలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం: 300 మందికి వైద్య సేవలు

**నందిగామ, ఆగస్టు 16 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆదివారం రోజున ప్రజల ఆరోగ్యం కోసం విజయవాడ యూనియన్ హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్, మారం సుబ్బయ్య నాగరత్నం మెమోరియల్ ట్రస్ట్, లైఫ్ లైన్ డయాగ్నస్టిక్స్ సెంటర్ మరియు పావన శ్రీ పాలి క్లినిక్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ఘనవిజయవంతమైంది.ఈ శిబిరంలో గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి మరియు నరముల వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్ ముఖేష్‌లు పాల్గొని సుమారు 300 మందికి పైగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఈసీజీ, 2డి ఎకో మరియు షుగర్ పరీక్షలు నిర్వహించి, డాక్టర్లు రోగులకు తగిన సలహాలు, సూచనలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు.ఈ బృహత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో క్యాంపు చైర్మన్ మారం అమరయ్య, హాస్పిటల్ యాజమాన్యం మరియు పావన శ్రీ పాలి క్లినిక్ అధినేత దాసు వెంకట నాగేశ్వరరావు ముఖ్యమైన పాత్ర పోషించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.






ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
17 సోమవారం ఆగస్టు 2026
7
www.prajaveekshanam.in

# కైకలూరులో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు!

ఏలూరు జిల్లా, ఆగస్టు 16 (కైకలూరు):



స్వాతంత్ర్య సమరయోధులు, జాతి గర్వించదగిన వీరుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను కైకలూరు మండలంలో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కోఆర్డినేషన్ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు, కో కన్వీనర్ బొమ్మన బోయిన విజయలక్ష్మీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి.రాధ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి జయ శ్యామల మాల్యాద్రి, క్లస్టర్–5 కన్వీనర్ పోలవరపు లక్ష్మీరాణి, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ), పట్టణ టీడీపీ అధ్యక్షులు పడమట వాసు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరాబత్తిన సుధ, యమ్.డి. జానీ, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటి డైరెక్టర్ యమ్.డి. ఉస్మాన్, పి.ఏ.సి.యస్ అధ్యక్షులు వేల్పూరి చంద్రమోహన్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ లక్కింశెట్టి రామమోహనరావు, సయ్యద్ భాషిద్, తామరకొల్లు నీటి సంఘం అధ్యక్షులు గంగుల ఏసురాజు, దైతగుంజ రామస్వామి, కట్టా గోపి, కట్టా రాఘవులు, ఏగిరెడ్డి సురేష్, జక్కుల విజయ్ తదితరులు పాల్గొని లచ్చన్న గారికి నివాళులు అర్పించారు.

# దేవాలయం వద్ద ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే..

దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా విక్షణం



దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద సోమవారం నుంచి తొమ్మిదో వార్షికోత్సవం ఉన్నందుకు ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. తదుపరి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కన్నయ్య ఎమ్మెల్యే కు శాలువతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్, నరేష్, ఈశ్వర్, రఘు, హరికాంత్, కిషోర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



# కిట్స్ వరంగల్ లైబ్రేరియ న్ డాక్టర్ కె. ఇంద్రసేనారెడ్డి కి ప్రతిష్టాత్మక ఎంఏఎల్ఏ బెస్ట్ టీచర్ అవార్డు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)

కిట్స్ వరంగల్ లైబ్రేరియన్ డాక్టర్ కొమల్ల ఇంద్రసేనా రెడ్డికి ప్రతిష్టాత్మక మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ (ఎంఏఎల్ఏ) బెస్ట్ టీచర్ అవార్డు--2026 లభించిం ది. లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ రంగంలో విశేష కృషి, అంకి తభావంతో కూడినసేవలు, దీర్ఘకాలిక సహకారాన్ని గుర్తించి ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. చెన్నై కొట్టూరు పురంలోని అన్నా శత జయంతి గ్రంథాలయంలో డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథ న్ 134వ జయంతిని పుర స్కరించుకుని ఆగస్టు 16న నిర్వహించిన జాతీయ గ్రంథాలయ నిపుణుల దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును ప్రదానం చేశా రు. మద్రాస్ విశ్వవిద్యాల య ఉపకులపతి డాక్టర్ ఎస్. ఆర్మ్‌స్ట్రాంగ్, ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. దొరస్వామి చేతుల మీదుగా డాక్టర్ ఇంద్రసేనారెడ్డి పురస్కారా న్ని అందుకున్నారు. కాక తీయ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నిం గ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలలో లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ రంగంలో 18 ఏళ్లపాటు అందించిన విశిష్ట బోధన, వృత్తిపరమై న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీ కాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకరాచారి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యా ర్థి ప్రతినిధులు, విద్యార్థు లు డాక్టర్ ఇంద్రసేనారెడ్డిని అభినందించి శుభాకాంక్ష లు తెలిపారు.





# జుజ్జూరు గ్రామంలో 21వ రోజుకు చేరిన డోర్ టు డోర్ కార్యక్రమం

జుజ్జూరు, ఆగస్టు 16 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో కొనసాగుతున్న డోర్ టు డోర్ కార్యక్రమం 21వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వం పనులు బాగా చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కాపా రాంబాబు, నందిగామ నియోజకవర్గం అధ్యక్షులు కొమ్మూరి శేషు, కామా ప్రకాష్ రావు, నల్లపు గోపి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం అని తెలిపారు.



# హసన్‌పర్తి కరాటే క్రీడాకారుల గిన్నిస్ వరల్డ్ రికార్డు విజయం

## విజేతలను అభినందించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)

వర్ధన్నపేట నియోజకవర్గం హసన్‌పర్తికి చెందిన కరాటే క్రీడాకారులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి నియోజక వర్గానికి, జిల్లాకు గర్వకార ణంగా నిలిచారని వర్ధన్న పేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు కరాటే పోటీ ల్లో విశిష్ట ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించిన కోడెం శ్రీనాథ్, మాటేటి నాగచైతన్య, కోచ్ కోడెం శ్రీనివాస్‌లను ఎమ్మెల్యే అభినందించారు. సుబే దారిలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను శాలువాలతో సత్కరించి, మెడల్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వ హించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కరాటే పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహి స్తూ క్రీడాకారులు పాల్గొ న్నారు. తాజాగా లండన్ నుంచి అధికారికంగా గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అంద డంతో ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించా రు. క్రీడాకారులు ఇదే స్ఫూ ర్తితో మరిన్ని విజయాలు సాధించి హసన్‌పర్తి, వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగళి వెంకట్ రామ్ నర సింహారెడ్డి, సీనియర్ నాయకులు విసం సురేంద ర్‌రెడ్డి, 66వ డివిజన్ అధ్య క్షుడు గొర్రె కిరణ్, మాటేటి వెంకటేష్, బయ్యగని కుమారస్వామి, కోడెపాక నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎల్కతుర్తి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా అడ్డూరి అనిల్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)

ఎల్కతుర్తి మండల ఎమ్మా ర్పీఎస్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అడ్డూరి అనిల్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కొయ్యడ రాజేందర్ మాదిగ ఎన్నికయ్యారు. మాజీ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమా ర్ మాదిగ అధ్యక్షతన జరి గిన కమిటీ నిర్మాణ సద స్సులో జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జాతీయ సదస్సును విజ యవంతం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. నూతన కమిటీ సభ్యులు ఉద్యమాన్ని మండల స్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



# వందేమాతరం గీత అవమానంపై బీజేవైఎం నిరసన జ్వాల!

## కె బి ఎన్ కాలేజ్ సెంటర్, చిట్టినగర్, విజయవాడ ।

నందిగామ (ప్రజా వీక్షణం) -- ఆగస్టు 16:

న్యూఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా "వందేమాతరం" గీతాన్ని పూర్తిగా ఆలపించకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలను బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణరెడ్డి తీవ్రంగా ఖండించారు. మన జాతీయ స్ఫూర్తికి జరిగిన ఈ అవమానానికి నిరసనగా కోమల విలాస్ సెంటర్ నుండి కె బి ఎన్ కళాశాల వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరియు మల్లికార్జున ఖర్గేల చర్యలను తప్పుబట్టారు. వందేమాతరం గీతాన్ని మరియు భారత స్వాతంత్ర్య పోరాటంతో ముడిపడి ఉన్న భావోద్వేగాలను అవమానించినందుకు కాంగ్రెస్ నాయకత్వం దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో షర్మిల, కృష్ణ, రవి నాయుడు, సాయి గాయత్రి, ప్రమోద్, మనోజ్, వెంకటేష్, రాజేశ్వరి, హేమంత్, చంద్రశేఖర్ తదితర పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 16 (ప్రజా వీక్షణం న్యూస్)

గీత కార్మికుల సమస్యల ను రాష్ట్ర ప్రభుత్వం వెంట నే పరిష్కరించాలని కేవీపీ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరు గంటి సాంబయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కా రం కోసం కల్లుగీత కార్మిక సంఘం చేపట్టిన గీతన్నల చైతన్య యాత్ర 15వ రోజు కాజీపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా కేవీపీఎస్, వృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. గీత కార్మికులకు పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచాలని, ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి ఎక్స్ గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషి యా నిధులను వెంటనే విడుదల చేయాలని నాయ కులు డిమాండ్ చేశారు. నీరా, తాటి బెల్లం పరిశ్ర మలను ప్రభుత్వ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, గీత కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాల ని కోరారు. గీత కార్మికుల న్యాయమైన పోరాటానికి కేవీపీఎస్, వృత్తిదారుల సంఘాలు సంపూర్ణ మద్ద తు ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం అశోక్, రవి, రామ స్వామి, ఉమాకర్ తదితరులు పాల్గొన్నారు.




# పోలవరంలో ఈ నెల ఆగష్టు 23న మెగా ఉచిత వైద్య శిబిరం -- ప్రజలకు ఆహ్వానం

పోలవరం ఆగష్టు 16(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లాలోని పోలవరంలో సెక్యూరిటీ సర్వీస్ మరియు జంగారెడ్డిగూడెం కాటన్ దొర హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మహా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. టెక్ మహీంద్రా హైదరాబాద్ మెకానికల్ ఇంజనీర్ సొబ్బన చంద్రహాస్ జోషి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరం, ఆగస్టు 23, 2026 ఆదివారం రోజున ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు పోలవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ రోడ్, చైతన్య ల్యాబ్ దగ్గర జరుగుతుంది. ఈ ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, విష జ్వరాలు, మలేరియా, షుగర్, బి.పి. వ్యాధులతో పాటు గుండె మరియు దంత సమస్యలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తారు. అంతేకాకుండా ఆర్.బి.ఎస్., ఇ.సి.జి., మలేరియా, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ ల్యాబ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ వైద్య శిబిరానికి ఏ.పి. ట్రేకర్ చైర్మన్, టీడీపీ పోలవరం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ బొరగం శ్రీనివాసులు, పోలవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ బండి విజయభాస్కర్, పోలవరం పంచాయతీ సర్పంచ్ పొట్టం పుష్ప, పోలవరం మండల పరిషత్ అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి తదితర ముఖ్య మరియు విశిష్ట అతిథులు విచ్చేస్తున్నారు. పోలవరం టౌన్ ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. మరిన్ని వివరాల కోసం మేనేజింగ్ డైరెక్టర్ యన్. కృష్ణ చైతన్య నంబర్ 9182768874 లేదా జంగారెడ్డిగూడెం కాటన్ దొర హాస్పిటల్ నంబర్లు 9010873108, 9182768874 లను సంప్రదించవచ్చు.

# విద్య అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత.. ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర ఆగస్టు 16 ప్రజా వీక్షణం

విద్యారంగంలో అభివృద్ధి కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారము నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోని పల్ల మర్రి గ్రామంలోని ఎన్నగుట్ట సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఏటీసీ కాలేజ్ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వెంకటస్వామి తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యారంగంలో అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏటీసీ కాలేజ్ ఏర్పాటుతో పల్ల మర్రి, ఎన్నగుట్ట పరిసర ప్రాంతాల విద్యార్థులకు విద్యాపరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందనిఆయన అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన విద్యా, మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీఆయన ఇచ్చారు. పల్లమర్రి ప్రాంతంలో విద్యాభి వృద్ధికి మరో ముందడుగు పడటంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, టిపిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని పూజలు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని నంద మూరు గ్రామంలో కొలువైన వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు అడపా ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయ కులు శనగన రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేస్తూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దూళ్ళ వెంకట సూర్యనారాయణ, అరసాల సుబ్బు, అడపా శ్రీనివాస్, అడపా నాగేశ్వరరావు, నందం గారి, తాతకుంట్ల దుర్గారావు, ఈరుళ్ళ నాని, తాతకుంట్ల విజయ్, అరసాల ప్రసాద్, ఆరుగొల్లు శ్రీను, ఆరుగొల్లు బాలయ్య, ఆరుగొల్లు అర్జున్, ఖండవల్లి రమణ, రెడ్డి నాగరాజు, కొమ్మా నాగరాజు, మార్లపూడి శ్రీను, తుమ్మపాల అప్పలాచార్యులు, అడపా దానయ్య, అడపా రాంబాబు, గొర్సిపూడి దానయ్య, వద్ది వెంకటనారాయణ, అల్లాడి త్రిమూర్తులు, దార్లంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# స్కూల్ శానిటేషన్, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి -- ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతి

జీలుగుమిల్లి, ఆగస్టు 16:(ప్రజా వీక్షణం)

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జీలుగుమిల్లి మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుధ్యాన్ని కాపాడుతూ, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్న శానిటేషన్ వర్కర్లు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చాలాకాలంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. శానిటేషన్ వర్కర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు పెంచడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా తక్కువ పారితోషికంతో కార్మికులతో పని చేయించడం అన్యాయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, పారిశుధ్యం, పోషకాహారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. శానిటేషన్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సీఐటీయూ కోరింది. ఈ వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో మట్టా మంగతయారు, రాయిన అనసూర్య, జల్లిపల్లి లక్ష్మీ, జగదా, మహాలక్ష్మి, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



# దేశంలో విప్లవాత్మక అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు వాజపేయి

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)

దేశంలో విప్లవాత్మక అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి కొనియాడారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను అధ్యక్షతన దేశ మాజీ ప్రధాని వాజపేయి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పథకం ద్వారా దేశంలోని ప్రధాన నగరాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేసి మౌలిక వసతుల అభివృద్ధికి బాటలు వేశారని చెప్పారు. పార్లమెంటులో వాజపేయి ప్రసంగం కోసం ప్రతిపక్ష సభ్యులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వారని, తన సహజ కవితా శైలిలో ఆయన చేసే ప్రసంగాలు సభికులను ఆకట్టుకునేవని గుర్తుచేశారు. బిజెపి నర్సాపురం పార్లమెంటరీ మీడియా ఇన్చార్జ్ నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ భాజపా నరసాపురం పార్లమెంటరీ మీడియా ఇన్‌ఛార్జి నడిచే సోమేశ్వరరావు మాట్లాడుతూ వాజపేయి ప్రధానిగా పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి భారత్‌ను అణు శక్తి సామర్థ్యం కలిగిన దేశంగా ప్రపంచ దేశాల సరసన నిలిపారని ప్రశంసించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాజపేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ముందుగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా నాయకులు ఇమ్మంది బెనర్జీ, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి, కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహామూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాటే నాగేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తాడాల సూర్యకుమారి, పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మీదుర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వయ్యారిభామ కలుపు మొక్కతో పంటలకు ముప్పు

## కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవీవరప్రసాద్ రెడ్డి

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజా వీక్షణం)

పార్తీనియం (వయ్యారిభామ) కలుపు మొక్కతో పంటలకు ముప్పు ఏర్పడుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవీ వరప్రసాద్ రెడ్డి సూచించారు. తాడేపల్లి గూడెం మండలం వెంకట్రామన్న గూడెం లోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వ విద్యాల యంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పార్తీనియం (వయ్యారిభామ) మొక్కపై రైతులకు ఆయన అధ్యక్షతన ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవీవరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పార్తీనియం కలుపు మొక్క వేగంగా వ్యాప్తి చెందుతూ పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. మనుషులు, పశువుల్లో అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులకు గురిచేస్తుందని చెప్పారు. పార్తీనియం విత్తనాలు విస్తృతంగా వ్యాప్తి చెందడం వల్ల భవిష్యత్తులో కలుపు నియంత్రణ మరింత కష్టతరమవుతుందని తెలియజేశారు. పార్తీనియం నియంత్రణకు మొక్కలను చిన్న దశలోనే పీకివేయాలని, పుష్పించే ముందే తొలగించాలని రైతులకు సూచించారు. పొలాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సమగ్ర కలుపు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పార్తీనియం నిర్మూలనకు రైతులు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్తీనియం వల్ల కలిగే హానిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనను కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

17 సోమవారం ఆగస్టు 2026

9

www.prajaveekshanam.in

## చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త రైలు.. టైమింగ్స్ ఇవే!

చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

అక్టోబర్ 2న ప్రారంభం కానున్న సర్వీసులు

పూర్తిగా నాన్-ఏసీ, స్లీపర్ కోచ్‌లతో ప్రయాణం

తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీ మీదుగా రాకపోకలు

హైదరాబాద్ నుంచి ఇది ఆరవ అమృత్ భారత్ సర్వీస్

హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ప్రయాణించే వారికి దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. చర్లపల్లి టెర్మినల్ నుంచి గోరఖ్‌పూర్ జంక్షన్ మధ్య కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (22075/22076) రైలును ప్రవేశపెట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నాన్–ఏసీ సూపర్ ఫాస్ట్ రైలు సర్వీసులు 2026 అక్టోబర్ నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైలు (22075) చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు తన రెగ్యులర్ సర్వీసును అక్టోబర్ 2వ తేదీ (శుక్రవారం) నుంచి ప్రారంభించనుంది. ప్రయాణానికి సుమారు 32 గంటల 40 నిమిషాల సమయం పడుతుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్ నుంచి చర్లపల్లికి (22076) సర్వీసు అక్టోబర్ 4వ తేదీ (ఆదివారం) నుంచి మొదలవుతుంది. ఈ రైలు వారానికి ఒకసారి రెండు దిశల్లోనూ రాకపోకలు సాగిస్తుంది. ఆధునిక సదుపాయాలతో ప్రయాణం ఈ అమృత్ భారత్ రైలులో అత్యాధునిక సదుపాయాలు కల్పించారు. వేగవంతమైన ప్రయాణం కోసం పుష్–పుల్ టెక్నాలజీని ఉపయోగించారు. గంటకు 110 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుంది. ఇందులో కేవలం జనరల్ అన్ రిజర్వ్‌డ్, స్లీపర్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. ఇవి ఆధునిక నాన్–ఏసీ బోగీలు కాగా, ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు, సీల్డ్ గ్యాంగ్‌వేలు వంటి సౌకర్యాలు ఉన్నాయి. హైదరాబాద్–సికింద్రాబాద్ ప్రాంతం నుంచి ప్రారంభమవుతున్న ఆరవ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, తెలంగాణకు సేవలందిస్తున్న ఏడవ సర్వీస్ ఇది కావడం విశేషం. మార్గం, సమయాలు ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుంది. తెలంగాణలోని కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల స్టేషన్లలో ఆగుతుంది. అక్కడి నుంచి బల్హార్షా, నాగ్‌పూర్, ఇటార్సి, భోపాల్, ఝాన్సీ, కాన్పూర్ సెంట్రల్, లక్నో మీదుగా గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. రైలు నెం. 22075 చర్లపల్లిలో ప్రతి శుక్రవారం రాత్రి 9:45 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 6:25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెం. 22076 ప్రతి ఆదివారం ఉదయం 8:30 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి, సోమవారం సాయంత్రం 5:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ కొత్త సర్వీసుతో హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్లే వలస కార్మికులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.




# భోగాపురంలో దిగే తొలి విమానం ఇదే.. ప్రయాణికులకు గిఫ్టులు...!

భోగాపురం ఎయిర్‌పోర్టులో మొదలుకానున్న విమాన సర్వీసులు

హైదరాబాద్ నుంచి తొలి విమానంగా ఇండిగో ఫ్లైట్

తొలి ప్రయాణికులకు ఏటికొప్పాక బొమ్మలతో ప్రత్యేక స్వాగతం

బెంగళూరు నుంచి రెండో విమానంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్




ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుతూ, భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభమవుతున్నాయి. ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతూ హైదరాబాద్ నుంచి ఇండిగో విమానం తొలిసారిగా ఇక్కడి రన్‌వేపై అడుగుపెట్టనుంది. ఈ అపురూప క్షణంతో ఈ ప్రాంత విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కానుంది. విమానాశ్రయ ప్రారంభోత్సవంలో భాగంగా తొలి విమానంగా ఇండిగోకు చెందిన 6జు6408 ఫ్లైట్ హైదరాబాద్ నుంచి ఉదయం 6:45 గంటలకు భోగాపురంలో ల్యాండ్ అవుతుంది. ఆ తర్వాత కొద్దిసేపటికే, ఉదయం 7:30 గంటలకు బెంగళూరు నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన IX2064 విమానం కూడా ఇక్కడికి చేరుకుంటుంది. ఈ రెండు విమానాల రాకతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకు చెక్–ఇన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం, తొలి ప్రయాణికులకు బోర్డింగ్ పాసులు అందజేసి, ఎయిర్‌లైన్స్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోనున్నారు. తొలి విమానాల్లో వచ్చిన ప్రయాణికులకు అధికారులు ప్రత్యేక రీతిలో స్వాగతం పలకనున్నారు. వారికి స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏటికొప్పాక బొమ్మలు, ఫస్ట్–ఫ్లైట్ సర్టిఫికెట్లతో కూడిన గూడీ బ్యాగ్‌లను కానుకలుగా అందజేయ నున్నారు. ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 20 వరకు హై అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో విమానాశ్రయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు.

### భోగాపురం నుంచి ఢిల్లీకి 14 విమానాలు

విశాఖపట్నం నుంచి కార్యకలాపాలు సాగించే ఎయిరిండియా విమాన సర్వీసులన్నీ ఇకపై భోగాపురంలోని నూతన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడవనున్నాయి. ఆగస్టు 17 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని ఎయిరిండియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు ఎలాంటి గందరగోళం లేకుండా, పాత విశాఖ ఎయిర్‌పోర్ట్ కోడ్ కొత్త విమానాశ్రయానికి కూడా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. భోగాపురం నుంచి ఢిల్లీకి వారానికి 14 విమాన సర్వీసులను యథాతథంగా కొనసాగిస్తామని సంస్థ వెల్లడించింది. దీని ద్వారా తమ హబ్స్ మీదుగా కీలకమైన దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల మధ్య విమాన కనెక్టివిటీని మెరుగుపరిచేలా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నగరాలకు పలు రోజువారీ సర్వీసులను నడపనున్నట్లు తెలిపింది. కొత్త షెడ్యూల్ ప్రకారం, హైదరాబాద్ – భోగాపురం మధ్య రోజుకు రెండు విమాన సర్వీసులు నడుస్తాయి. బెంగళూరు – భోగాపురం మధ్య కూడా రోజుకు రెండు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అదనంగా సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో మరో రిటర్న్ సర్వీసును కూడా నడపనున్నారు. ప్రస్తుత ఏవియేషన్ టైమ్‌టేబుల్ ప్రకారం, ఈ కొత్త విమాన షెడ్యూల్ అక్టోబర్ 24 వరకు అమల్లో ఉంటుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన ఈ కొత్త విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సుమారు 77,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కొత్త టెర్మినల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులు కల్పించారు. ఇందులో 22 సంప్రదాయ చెక్–ఇన్ కౌంటర్లు, 18 సెల్ఫ్–బ్యాగేజ్ డ్రాప్ యూనిట్లు, అధునాతన స్క్రీనింగ్ వ్యవస్థలు, అత్యాధునిక బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సౌకర్యాలతో పాటు ఏడు ఏరోబ్రిడ్జ్‌లు ఉన్నాయి. ఇకపై ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌ను రక్షణ, పోలీసు అవసరాలు, వీఐపీల రాకపోకలు, షెడ్యూల్ లేని ప్రత్యేక విమానాల కోసం మాత్రమే వినియోగిస్తారని అధికారులు తెలిపారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్‌కు సేవలందించే ఈ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

## ఆసీస్ జట్టులో ప్రక్షాళన చేయాల్సిందే.. బంగ్లా చేతిలో ఓటమిపై పాంటింగ్ తీవ్ర ఆస్ట్రేలియాకు సొంతగడ్డపై షాక్.. బంగ్లాదేశ్ సంచలన విజయం

బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న బంగ్లా ఆటగాళ్లు

ఆస్ట్రేలియాలో టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా తంజీద్ హసన్ రికార్డు

జట్టులో మార్పులు చేయాలన్న మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్

మార్పులు చేస్తే పోయేదేమీ లేదని వ్యాఖ్య



ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో ప్రక్షాళన చేయాల్సిందేనని మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో డార్విన్ వేదికగా జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో పాంటింగ్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. జట్టు బ్యాటింగ్ లైనప్‌లో వెంటనే మార్పులు చేసి, యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశాడు. ఈ ఓటమి అత్యంత అవమానకరమని, జట్టులో మార్పులు చేయడం అనివార్యమని తాను భావిస్తున్నట్లు తెలిపాడు. “సాధారణంగా జట్టులో మార్పులు చేయాలని కోరుకునే వారిలో నేను చివరివాడిని. ఒక కెప్టెన్‌గా లేదా ఆటగాడిగా జట్టును కలిపి ఉంచడానికే ప్రాధాన్యత ఇస్తాను. కానీ, పరిస్థితులు చేయి దాటినప్పుడు మార్పుల గురించి మాట్లాడక తప్పదు. జట్టు ప్రదర్శన చూశాక, మార్పులు చేయడం సరైనదనిపిస్తోంది. కొత్త ఓపెనర్‌ను, నంబర్ 3 స్థానంలో మరో ఆటగాడిని తీసుకురావడం ద్వారా జట్టు పెద్దగా నష్టపోయేదేమీ లేదు. ఈ ప్రక్షాళన కచ్చితంగా జరగాలి” అని పాంటింగ్ ఛానల్ 7తో మాట్లాడుతూ వివరించాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఆదివారం ముగిసిన ఈ టెస్టులో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ (6 వికెట్లు) దెబ్బకు 198 పరుగులకే కుప్పకూల్చింది. అనంతరం బంగ్లాదేశ్, తంజీద్ హసన్ తమీమ్ (101) అద్భుత సెంచరీతో 426 పరుగుల భారీ స్కోరు సాధించి 228 పరుగుల ఆధిక్యం సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లో కామెరాన్ గ్రీన్ (104) ఒంటరి పోరాటం చేసినా, ఆసీస్ 284 పరుగులకే ఆలౌట్ అయింది. 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఒకే వికెట్ కోల్పోయి ఛేదించి 9 వికెట్ల తేడాతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది.

# రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు.. కాగ్ నివేదికతో రంగంలోకి దిగిన కేంద్రం

రైల్వే స్టేషన్లలో కలుషిత తాగునీటిపై కాగ్ నివేదికతో కేంద్రం అప్రమత్తం

మంత్రి అశ్విని వైష్ణవ్ ఉన్నతస్థాయి సమీక్ష.. తక్షణ చర్యలకు ఆదేశం

హైదరాబాద్ సహా 8 స్టేషన్ల నీటిలో 'ఇ కొలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తింపు

దేశవ్యాప్తంగా 20,000 చోట్ల కొత్త ఫిల్టర్ల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం

89 శాతం స్టేషన్లలో కనీస సౌకర్యాల కొరత ఉందని కూడా కాగ్ నివేదిక వెల్లడి



దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు. ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో “ట్యాంక్ టూ ట్యాప్” వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగ్ నివేదికలో కీలక అంశాలు దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్–సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల పరిధిలోని ఎనిమిది స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ కొలి ' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. 'ఇ కొలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భీవండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి. ఇదే నివేదికలో మరో కీలకమైన విషయాన్ని కాగ్ బయటపెట్టింది. సర్వే చేసిన 512 స్టేషన్లలో 458 స్టేషన్లు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యాయని పేర్కొంది. 2018 ఆగస్టు 31 నాటికే అన్ని స్టేషన్లలో ఈ సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. కాగ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నాల్లో భాగంగానే తాజా చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

# తిన్నది వంటపట్టడం లేదా? రోజూ ఇలా చేయండి!

### ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం నిపుణులు సూచిస్తున్న సాధారణ అలవాట్లు

### ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినాలి

### భోజనానికి, నిద్రకు మధ్య కనీసం రెండు గంటల విరామం అవసరం

### తిన్న వెంటనే కాసేపు నెమ్మదిగా నడవడం జీర్ణక్రియకు మేలు

### తగినంత నీరు తాగడం, మితంగా తినడం చాలా ముఖ్యం

మనం తీసుకునే ఆహారం శరీరానికి శక్తినివ్వాలి. కానీ, ఆధునిక జీవనశైలిలో చాలామందికి తిన్నది సరిగ్గా జీర్ణం కాక గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. మనం తినే పద్ధతిలో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించవచ్చు. తిన్న ఆహారం సక్రమంగా వంటపట్టి, శరీరం ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడే ముఖ్యమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం.

#### 1. నెమ్మదిగా నమిలి తినడం

జీర్ణప్రక్రియ కడుపులో కాదు, నోట్లోనే మొదలవుతుంది. ఆహారాన్ని ఎంత బాగా నమిలితే, లాలాజలంలోని ఎంజైమ్‌లతో అంత బాగా కలిసి చిన్న ముక్కలుగా మారుతుంది. దీనివల్ల కడుపుపై భారం తగ్గి, జీర్ణక్రియ సులభమవుతుంది. చాలామంది హడావుడిగా, సరిగ్గా నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల పెద్ద ఆహార ముక్కలను అరిగించడానికి జీర్ణాశయం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఫలితంగా అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ప్రతి ముద్దను



కనీసం 20 నుంచి 30 సార్లు నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఇది త్వరగా కడుపు నిండిన భావన కలిగించి, అతిగా తినడాన్ని కూడా నియంత్రిస్తుంది.

#### 2. సమయపాలన పాటించడం

మన శరీరానికి ఒక జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ఉంటుంది. రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల, ఆ సమయానికి జీర్ణరసాలు సక్రమంగా విడుదలై జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. సమయం కాని సమయాల్లో తినడం, భోజనం మానేయడం జీర్ణవ్యవస్థను గందరగోళానికి గురిచేస్తుంది. ముఖ్యంగా, తిన్న వెంటనే నిద్రపోవడం లేదా వ్యాయామం చేయడం వంటివి అస్సలు మంచిది కాదు. భోజనం తర్వాత కనీసం 10-15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం చేయడం అత్యంత ముఖ్యమైన అలవాటు. దీనివల్ల జీర్ణవ్యవస్థకు రాత్రంతా దాదాపు 10 నుంచి 12 గంటల పాటు పూర్తి విశ్రాంతి లభిస్తుంది.

#### 3. సరైన మోతాదులో ఆహారం, నీరు

శరీరానికి నీరు చాలా అవసరం. కానీ భోజనం చేసేటప్పుడు ఎక్కువగా నీరు తాగితే, జీర్ణరసాలు పలుచబడి జీర్ణక్రియ మందగిస్తుంది. అందుకే భోజనానికి అరగంట ముందు, తిన్న అరగంట తర్వాత నీళ్లు తాగడం ఉత్తమమైన పద్ధతి. అలాగే, కడుపు బిగిసేలా తినకుండా, కాస్త ఖాళీ ఉంచుకొని మితంగా తినాలి. ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోవడం జీర్ణాశయంపై తీవ్ర ఒత్తిడిని పెంచి, అజీర్ణానికి దారితీస్తుంది. ఈ మూడు సాధారణ అలవాట్లను మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఎలాంటి మందులు లేకుండానే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేసుకోవచ్చు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

# సేవింగ్స్ ఖాతాలో నగదు జమ: రూ.10 లక్షలు దాటితే ఏమవుతుంది? ఐటీ నిబంధనలు ఇవే!

### ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు దాటితే బ్యాంకుల నుంచి ఐటీ శాఖకు సమాచారం

### డిపాజిట్ చేసినంత మాత్రాన పన్ను పడదు, కానీ ఆధారం చూపాలి

### రూ.50,000 పైబడిన డిపాజిట్‌కు పాన్ కార్డు తప్పనిసరి

### ఒకరి నుంచి రోజుకు రూ.2 లక్షల నగదు స్వీకరించడంపై నిషేధం

సాధారణంగా చాలామంది తమ వద్ద ఉన్న నగదును బ్యాంకులోని పొదుపు ఖాతా (సేవింగ్స్ అకౌంట్)లో జమ చేస్తుంటారు. అయితే, ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంత మొత్తం వరకు నగదు జమ చేయవచ్చనే దానిపై చాలామందికి స్పష్టత ఉండదు. ఈ నిబంధనలను విస్మరిస్తే ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కాబట్టి నగదు లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన వివరాలు ఇక్కడ ఉన్నాయి.

#### రూ.10 లక్షల పరిమితి దాటితే ఏంటి పరిస్థితి?

ఒక వ్యక్తి తన సేవింగ్స్ ఖాతాలో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలకు మించి నగదు జమ చేస్తే, ఆ సమాచారాన్ని సంబంధిత బ్యాంకు తప్పనిసరిగా ఆదాయ పన్ను శాఖకు నివేదిస్తుంది. ఈ మొత్తాన్ని ఒకేసారి డిపాజిట్ చేసినా లేదా పలు దఫాలుగా జమ చేసినా ఈ నిబంధన వర్తిస్తుంది. అయితే, రూ.10 లక్షల పరిమితి దాటినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేవలం నగదు జమ చేసినందుకు పన్నులు లేదా జరిమానాలు విధించరు. కానీ, ఆదాయ పన్ను శాఖ అధికారులు ఆ డబ్బు మూలాన్ని గురించి ప్రశ్నించే అవకాశం ఉంటుంది. మీరు మీ ఆదాయ పన్ను రిటర్నుల ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది. జీతం, వ్యాపార లాభాలు, ఆస్తుల అమ్మకం, అద్దె ఆదాయం వంటి చట్టబద్ధమైన మార్గాల ద్వారా వచ్చిన డబ్బు అయితే, నిబంధనల ప్రకారం పన్ను చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. దీనికి సంబంధించిన ఆధారాలు (శాలరీ స్లిప్స్, వ్యాపార పద్దులు, అగ్రిమెంట్లు) సిద్ధంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

#### ఇతర కీలక నగదు లావాదేవీల నిబంధనలు

పాన్ కార్డు తప్పనిసరి: బ్యాంకులో ఒకేసారి రూ.50,000 కంటే ఎక్కువ నగదు జమ చేయాలంటే పాన్ కార్డు వివరాలు ఇవ్వడం తప్పనిసరి. ఒకవేళ పాన్ కార్డు లేకపోతే, ఫారం 60 సమర్పించాల్సి ఉంటుంది. సెక్షన్ 269ST నిబంధన: ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 269ST ప్రకారం, ఏ వ్యక్తి అయినా ఒకే వ్యక్తి నుంచి ఒకే రోజులో రూ.2 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తాన్ని నగదు రూపంలో స్వీకరించడం చట్టరీత్యా నేరం. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే, స్వీకరించిన మొత్తానికి సమానమైన జరిమానా విధించే అధికారం ఆదాయ పన్ను శాఖకు ఉంటుంది.

#### ఈ నిబంధన క్రింది వాటికి వర్తించదు:

ప్రభుత్వం, బ్యాంకింగ్ కంపెనీలు, పోస్టాఫీసు లేదా కో-ఆపరేటివ్ బ్యాంకులు చేసే లావాదేవీలు.

#### సెక్షన్ 269SS పరిధిలోకి వచ్చే లావాదేవీలు.

కాబట్టి రూ. 2 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం లావాదేవీలు జరిపేటప్పుడు వంటి డిజిటల్ పద్ధతుల ద్వారా మాత్రమే చెల్లింపులు లేదా స్వీకరణలు జరపడం చట్టబద్ధంనల్లధనాన్ని అరికట్టడం, పన్ను ఎగవేతను నిరోధించడం, లెక్కల్లో చూపని నగదు చలామణిని తగ్గించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. అందుకే, పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు చేసేటప్పుడు సరైన పత్రాలను భద్రపరుచుకోవడం, బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడవచ్చు.



# పెళ్లికి ముందే ఆర్థిక ఒప్పందం.. రొనాల్డో-జార్జినా జంట నుంచి ఏం నేర్చుకోవాలి?

### పోర్చుగల్‌లో రహస్యంగా వివాహం చేసుకున్న రొనాల్డో, జార్జినా

### ఆస్తులపై 'సెపరేషన్ ఆఫ్ అసెట్స్' విధానంలో ప్రీనప్ ఒప్పందం

### భవిష్యత్తులో విడిపోతే జార్జినాకు ప్రతినెలా భరణం, ఆస్తి హక్కులు

### భారతీయ జంటలకు వివాహంలో ఆర్థిక ప్రణాళికపై రొనాల్డో ఒప్పందం ఒక పాఠం

### పెళ్లికి ముందే డబ్బు గురించి స్పష్టత ఉండాలని సూచిస్తున్న నిపుణులు

ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన ప్రేయసి జార్జినా రోడ్రిగ్జ్‌ను రహస్యంగా వివాహం చేసుకోవడం తెలిసిందే. పదేళ్ల సహజీవనం అనంతరం ఇటీవలే పోర్చుగల్‌లో అత్యంత సన్నిహితుల మధ్య వీరి వివాహం జరిగింది. ఈ జంటకు ఐదుగురు పిల్లలు. అయితే, ఈ పెళ్లి కన్నా ఎక్కువగా ఇప్పుడు వారి మధ్య కుదిరిన ఆర్థిక ఒప్పందం (ప్రీనప్షియల్ అగ్రిమెంట్) చర్చనీయాంశంగా మారింది. వివాహ బంధంలో ఆర్థిక స్పష్టత ఎంత అవసరమో ఈ ఒప్పందం తెలియజేస్తోంది. నివేదికల ప్రకారం, రొనాల్డో-జార్జినా "సెపరేషన్ ఆఫ్ అసెట్స్" అనే ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం, వివాహానికి ముందు గానీ, వివాహ సమయంలో గానీ ఎవరికి వారు సంపాదించుకున్న ఆస్తులు, సంపద పూర్తిగా వారికే చెందుతాయి. అయితే, ఇద్దరూ కలిసి సంపాదించిన ఆస్తులను మాత్రం పంచుకోవచ్చు. అంతేకాదు, భవిష్యత్తులో ఒకవేళ వారు విడిపోవాల్సి వస్తే, జార్జినాకు ప్రతినెలా కొంత భరణం అందేలా, అలాగే కొన్ని ఆస్తులపై హక్కులు లభించేలా ఈ ఒప్పందంలో నిబంధనలు పొందుపరిచారు. ఇది సంపదను కాపాడుకుంటూనే, భాగస్వామికి ఆర్థిక భద్రత



కల్పించే ఒక సమతుల్య విధానం.

#### భారతీయ జంటలకు పాఠాలు

సాధారణంగా పెళ్లికి ముందు ఇలాంటి ఆర్థిక ఒప్పందాలను ప్రేమ, నమ్మకానికి వ్యతిరేకంగా చూస్తుంటారు. కానీ, వాస్తవానికి ఇవి వివాహ బంధంలో ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన కీలక సాధనాలు. భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. పాశ్చాత్య దేశాల్లో ప్రీనప్ ఒప్పందాలకు చట్టబద్ధత ఉన్నప్పటికీ, భారత చట్టాలు వీటిని అధికారికంగా గుర్తించవు. అయినప్పటికీ, రొనాల్డో ఒప్పందం నుంచి భారతీయ జంటలు నేర్చుకోవాల్సిన ఆర్థిక పాఠాలు చాలా ఉన్నాయి. 1. డబ్బు గురించి ముందే మాట్లాడటం: ఆదాయం, అప్పులు, ఆస్తులు, ఆర్థిక అంచనాల గురించి పెళ్లికి ముందే దాపరికం లేకుండా మాట్లాడుకోవడం చాలా ముఖ్యం. 2. యాజమాన్యంపై స్పష్టత: ఆస్తుల యాజమాన్యంపై స్పష్టమైన రికార్డులు నిర్వహించాలి. ఉమ్మడి, వ్యక్తిగత ఖాతాలు, పెట్టుబడులపై పత్రాలు, నామినేషన్ల విషయంలో జాగ్రత్త వహించాలి. 3. దీర్ఘకాలిక భద్రత: కేవలం ఆస్తుల రక్షణే కాకుండా, బీమా, వీలునామా, అత్యవసర నిధులు, పిల్లల భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలి. 4. ఆర్థిక స్వాతంత్ర్యం: ఇద్దరూ సంపాదించే కుటుంబాల్లో, వ్యక్తిగత ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కొనసాగిస్తూనే ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పనిచేయవచ్చు. వివాహం అనేది కేవలం భావోద్వేగాల కలయికే కాదు, అదొక ఆర్థిక భాగస్వామ్యం కూడా. రొనాల్డో సంపద చాలా పెద్దది కావచ్చు, కానీ వివాహ బంధంలో ఆర్థిక స్పష్టత, ముందస్తు ప్రణాళిక అనే సూత్రం అందరికీ వర్తిస్తుంది. ఇది ఇద్దరు భాగస్వాముల భవిష్యత్తుకు రక్షణ కవచంలా పనిచేస్తుంది.

# జాతీయ గీతాన్ని మార్చాలి: నటుడు ముఖేష్ ఖన్నా సంచలన వ్యాఖ్యలు

'జన గణ మన' స్థానంలో 'వందేమాతరం'ను జాతీయ గీతంగా ప్రకటించాలన్న నటుడు ఈ దిశగా మోదీ ప్రభుత్వం ఇప్పటికే పనిచేస్తోందని ముఖేష్ ఖన్నా వ్యాఖ్య 'జన గణ మన' బ్రిటీష్ రాణిని కీర్తిస్తూ రాసిన గీతమని ఆరోపణ గతంలోనూ పలు వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన నటుడు 90వ దశకంలో 'శక్తిమాన్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు ముఖేష్ ఖన్నా మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. జాతీయ గీతం 'జన గణ మన'ను తొలగించి, దాని స్థానంలో 'వందేమాతరం'ను అధికారిక జాతీయ గీతంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 'జన గణ మన' మన దేశ జాతీయ గీతం కాదని, అది బ్రిటీష్ రాణిని కీర్తిస్తూ రాసిన గీతమని ఆయన ఆరోపించారు. ఆదివారం ఒక వార్తా సంస్థతో ముఖేష్ ఖన్నా మాట్లాడుతూ, "వందేమాతరంను జాతీయ గీతంగా చేయాలని నేను మూడేళ్ల క్రితమే చెప్పాను. రవీంద్రనాథ్ ఠాగూర్ బ్రిటీష్ రాణి ఎలిజబెత్‌ను పొగుడుతూ 'జన గణ మన' రాశారు. దానిని మనం జాతీయ గీతంగా స్వీకరించాం. అందులో ప్రస్తావించిన భాగ్యవిధాత, పంజాబ్, సింధ్ వంటివి మనవి కావు. కానీ 'వందేమాతరం' పూర్తిగా మనది. లతా మంగేష్కర్ గారు ఆ గీతాన్ని ఎంతో అద్భుతంగా ఆలపించారు" అని పేర్కొన్నారు. తాను కూడా 'వందేమాతరం'పై ఏడు నిమిషాల నిడివి గల ఒక ఐకానిక్ గీతాన్ని రికార్డ్ చేశానని, అది ఆరు నెలల్లో విడుదల అవుతుందని తెలిపారు. అంతేకాకుండా, "వీలైనంత త్వరగా 'జన గణ మన'ను తొలగించి, 'వందేమాతరం'ను తీసుకురావాలి. ప్రధాని మోదీ గారు ఈ దిశగా ఇప్పటికే పని ప్రారంభించారు. ఇప్పుడు ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యక్రమంలో 'వందేమాతరం'ను తప్పనిసరి చేస్తున్నారు. గతంలో, స్టాండప్ కమెడియన్ సమయ్ రైనా తన 'శక్తిమాన్' పాత్రపై వ్యంగ్యంగా మాట్లాడినప్పుడు, ముఖేష్ ఖన్నా సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. సమయ్ రైనాను "కుక్క తోక" అంటూ ఘాటుగా విమర్శించారు. అయితే, ఆశ్చర్యకరంగా ఆ తర్వాత కొద్ది రోజులకే వారిద్దరూ కలిసి ఒక వాణిజ్య ప్రకటనలో నటించడం గమనార్హం. తన అభిప్రాయాలను ముక్కుసూటిగా, ఎలాంటి సంకోచం లేకుండా వెల్లడించడంలో ముఖేష్ ఖన్నా ఎప్పుడూ ముందుంటారని సినీ వర్గాలు అంటుంటాయి.

ప్రజాపీక్షణం దినపత్రిక

SPORTS/ BUSINESS

17 సోమవారం ఆగస్టు 2026

www.prajaveekshanam.in



# క్రికెట్‌లో స్పెయిన్ తుఫాన్..

## ఆస్ట్రేలియా ‘ఆల్‌టైమ్ రికార్డు’ బ్రేక్..!

యూరప్ ఖండానికి చెందిన స్పెయిన్ ఫుట్‌బాల్ ఆటలోనే కాదు క్రికెట్‌లోనూ దూసుకెళ్తోంది. ఈ మధ్యే ఆ దేశ సాకర్ జట్టు ఫిఫా వరల్డ్‌కప్‌ను ఒడిసిపట్టగా.. తాజాగా స్పెయిన్ పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా ‘ఆల్‌టైమ్ రికార్డు’ను బ్రేక్ చేసింది. అంతర్జాతీయ టీ20ల్లో అనామక జట్టుగా అడుగుపెట్టి.. వరసగా 21 విక్టరీలతో ఆసీస్‌ను రెండో స్థానానికి తోసేసింది యూరప్ జట్టు. అంతేకాదు 2028లో టీ20 వరల్డ్ కప్ బెర్తుకు గట్టి పోటీదారుగా మారింది స్పెయిన్.టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి ఆటలకు పేరొందిన స్పెయిన్ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అదరగొడుతోంది. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న స్పెయిన్.. టీ20 వరల్డ్‌కప్ యూరప్ ఉప ప్రాంతీయ క్వాలిఫయర్ సీ మ్యాచ్‌లో ఆదివారం ఫిన్లాండ్‌పై 8 వికెట్లతో గెలుపొందింది. ఈ విజయంతో రెండేళ్ల తర్వాత రాబోయే పొట్టి ప్రపంచకప్‌లో ఆడే అవకాశానికి మరింత చేరువైంది.ప్రస్తుతం టీ20ల్లో 28వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఇది వరసగా 21 విజయం. దాంతో, వరసగా 20 విజయాలతో రికార్డు నెలకొల్పిన ఆస్ట్రేలియా రెండో స్థానానికి పడిపోయింది. 2023 నుంచి 2026 మధ్య 21 విజయాలతో స్పెయిన్ ఈ మైలురాయిని అందుకుంది. ఈ క్రమంలో జెర్సీ, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, గ్రీస్, ఫిన్లాండ్ వంటి జట్లను ఓడించింది యూరప్ టీమ్.



# ఫైనల్లో కంగుతిన్న సన్‌రైజర్స్..

## హండ్రెడ్ ట్రోఫీని ముద్దాడిన ట్రెంట్ రాకెట్స్..!

మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్‌ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది.ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్. చిన్నపాటి లక్ష్యాన్ని 54 బంతుల్లోనే ఊఫ్‌మనిపించింది గార్డ్‌నర్ బృందం. 92 పరుగుల ఛేదనలో ఓపెనర్లు సోఫియా డంక్లే(41), బేత్ మూనీ(31 నాటౌట్)లు శుభారంభమిచ్చారు.సన్‌రైజర్స్ బౌలర్లను ఎడాపెడా ఉతికేసిన ఈ ద్వయం బౌండరీతో స్కోర్‌బోర్డును ఉరికించింది. డంక్లే, నాట్ సీవర్ బ్రంట్(4)లు ఔటైనా.. కెప్టెన్ అష్లే గార్డ్‌నర్(9 నాటౌట్)తో కలిసి రాకెట్స్‌ను తొలిసారి హండ్రెడ్ లీగ్ విజేతగా నిలిపింది మూనీ. రెండో అత్యల్ప స్కోర్ లీగ్ దశలో సంచలన ఆటతో ఫైనల్ చేరిన సన్‌రైజర్స్ లీడ్స్ ఆఖరి మెట్టుపై తడబడింది. ఫామ్‌లో ఉన్న ఫొబే లిచ్‌ఫీల్డ్(10) సహా, మిడిలార్డర్ బ్యాటర్లు విఫలమవ్వడంతో అనూహ్యంగా 91 పరుగులకే ఆలౌటైంది. రాకెట్స్ బౌలర్లలో కిమ్ గార్త్(2-18), సమంతా బేట్స్(2-17), చార్లీ ఫిలిప్స్(2-12)లు రెండేసి వికెట్లతో రాణించగా.. సథర్‌లాండ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఫలితంగా డానియల్ గిబ్సే సారథ్యంలోని ఆరెంజ్ ఆర్మీ ఈ లీగ్ ఫైనల్లో రెండో అత్యల్ప స్కోర్ నమోదు చేసింది.

## అర్ధ శతకంతో మెరిసిన జురెల్..

# టీమిండియా భారీ స్కోర్..!

గాలే టెస్టులో తొలి రోజే పటిష్ఠ స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు తడబడింది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా.. మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే.. టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది.తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167 : 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా.. చూస్తుండగానే రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ.. ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్.. డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా.. జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.




# ద్విశతకం చేజార్చుకున్న పడిక్కల్.. నాలుగొందలకు చేరువైన భారత్..!

గాలే టెస్టులో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడిన దేవ్‌దత్ పడిక్కల్(167) ద్విశతకం చేజార్చుకున్నాడు. రెండో రోజు కూడా శ్రీలంక బౌలర్లను విసిగించిన ఈ లెఫ్ట్ హ్యాండర్‌ను ఎట్టకేలకు ప్రభాత్ జయసూర్య(2-92) వెనక్కి పంపాడు. టెస్టుల్లో తొలి శతకాన్నే డబుల్ సెంచరీగా మలచాలనుకున్న అతడు ఔటవ్వడంతో ఐదో వికెట్ కోల్పోయింది టీమిండియా. ప్రస్తుతం ధ్రువ్ జురెల్(19 నాటౌట్), రవీంద్ర జడేజా(1 నాటౌట్)లు ఆడుతున్నారు.సుదీర్ఘ ఫార్మాట్‌లో ఛతేశ్వర్ పూజారా అనంతరం మూడో స్థానంలో నేను సరిపోతాను అని శతకంతో చాటిన దేవ్‌దత్ పడిక్కల్(167 : 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా.. చూస్తుండగానే రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది.వెంటవెంటనే ఇద్దరూ ఔటైన వేళ.. ధ్రువ్ జురెల్(19 నాటౌట్) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్.. డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(4 నాటౌట్)..జురెల్ ఆచితూచి ఆడుతున్నారు. 94 ఓవర్లకు 364/5తో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన 450 ప్లస్ కొట్టాలంటే ఈ ఇద్దరూ క్రీజులో నిలవాల్సిందే.



# బంగ్లాదేశ్ గొప్పగా ఆడింది..

## ఈ ఓటమి నుంచి మేము పుంజుకోవడం కష్టమే..!

సొంతగడ్డపై ప్రత్యర్థులకు వణుకు పుట్టించే ఆస్ట్రేలియా ను బంగ్లాదేశ్ అలవోకగా ఓడించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన బంగ్లా చరిత్రాత్మక విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో ముందంజ వేసింది. స్వదేశంలో.. చిన్న జట్టు చేతిలో ఊహించని ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఏమాత్రం సంకోచించకుండా స్పందించాడు. అన్ని విభాగాల్లో తమకంటే బంగ్లాదేశ్ గొప్పగా ఆడిందని.. ఈ ఓటమి నుంచి తేరుకోవడం తమకు కష్టంగా ఉండనుందని కమిన్స్ అన్నాడు.డార్విన్ టెస్టులో తొలి రోజు నుంచి ఆధిపత్యం చెలాయించిన బంగ్లాదేశ్ చరిత్రాత్మక విజయం నమోదు చేసింది. డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాపై మొట్టమొదటి టెస్టు విక్టరీతో సిరీస్‌లో ముందంజ వేసింది నజ్ముల్ హుసేన్ శాంటో సేన. ఊహించని పరాజయంపై ఆసీస్ సారథి ప్యాట్ కమిన్స్ మ్యాచ్ అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమకంటే బంగ్లాదేశ్ గొప్పగా ఆడిందని పేర్కొన్న ప్యాటీ.. అన్ని విభాగాల్లోనూ తాము విఫలమయ్యాని చెప్పాడు. ‘బంగ్లాదేశ్ ఆటగాళ్లు చాలా గొప్పగా ఆడారు. చెప్పలాంటే అన్ని విభాగాల్లోనూ మమ్మల్ని వెనక్కినెట్టారు. ఎంతో ఓపికగా, క్రమశిక్షణలో ఆడారు. ఈరోజు బంగ్లా స్పిన్నర్లు చాలా ప్రమాదకరంగా కనిపించారు. ఆ జట్టు పేసర్లు వికెట్లు తీశారు. బ్యాటర్లు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. ఈ విజయానికి అర్హులు వాళ్లే. ఒకసారి వెనకబడ్డాక.. మళ్లీ పుంజుకోవడం మాకు కష్టమే’ అని కమిన్స్ తెలిపాడు.తొలి ఇన్నింగ్స్‌లో హసన్ మహమూద్ ఆరు వికెట్లతో ఆసీస్ నడ్డి విరిచాడు. అనంతరం తంజిద్ హసన్ శతకంతో భారీ స్కోర్ కొట్టిన బంగ్లాదేశ్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ చెలరేగింది. బ్యాటింగ్‌లో 65 పరుగులతో రాణించిన మెహిదీ హసన్ మిరాజ్.. ఐదు వికెట్లతో కంగారూల పతనాన్ని శాసించాడు. కామెరూన్ గ్రీన్ శతకం బాదినా.. ఆస్ట్రేలియా 284కే ఆలౌటైంది. అనంతరం.. స్వల్ప లక్ష్యాన్ని ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది బంగ్లా. ఇరుజట్ల మధ్య కీలకమైన రెండో టెస్టు ఆగస్టు 22 నుంచి జరుగనుంది.

## ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ చారిత్రక విజయం..

# తొలిసారి గెలిచి సంచలనం

ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ తొలిసారి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి బంగ్లాదేశ్ సంచలన విజయాన్ని నమోదు చేసింది. 40 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్‌కు ఇది అత్యంత చిరస్మరణీయ గెలుపుగా నిలిచింది.ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ కావడంతో బంగ్లాదేశ్ ముందు 57 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. నాలుగో రోజు రెండో సెషన్‌లోనే బంగ్లా ఆ లక్ష్యాన్ని ఛేదించింది. మొమినుల్ హక్ 30, షాద్మాన్ ఇస్లామ్ 25 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. మెహదీ, హసన్ మహ్మూద్ అద్భుత ప్రదర్శన బంగ్లాదేశ్ విజయంలో బౌలర్లు కీలక పాత్ర పోషించారు. మెహదీ హసన్ మిరాజ్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. మ్యాచ్‌లో బ్యాటింగ్‌లోనూ 65 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో పేసర్ హసన్ మహ్మూద్ మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. అతడికి ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. గ్రీన్ సెంచరీ చేసినా.. ఆస్ట్రేలియా తరఫున కామెరాన్ గ్రీన్ పోరాడాడు. దాదాపు ఐదు గంటల పాటు క్రీజులో నిలిచిన అతడు సొంతగడ్డపై తొలి టెస్టు సెంచరీ నమోదు చేశాడు. అయితే అతడి పోరాటం ఆస్ట్రేలియాను ఓటమి నుంచి కాపాడలేకపోయింది. హసన్ మహ్మూద్ బౌలింగ్‌లో గ్రీన్ బౌల్డ్ కావడంతో ఆస్ట్రేలియా చివరి ఆశలు కూడా ఆవిరయ్యాయి. బంగ్లాదేశ్‌కు అరుదైన ఘనత ఆస్ట్రేలియా గత 23 టెస్టుల్లో 18 విజయాలతో బలమైన జట్టుగా కొనసాగుతోంది. మరోవైపు విదేశీ గడ్డపై బంగ్లాదేశ్ రికార్డు అంతంతమాత్రంగానే ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే 9 వికెట్ల తేడాతో ఓడించడం బంగ్లా క్రికెట్‌లో ప్రత్యేక ఘట్టంగా మారింది. ఆస్ట్రేలియాలో టెస్టు విజయం సాధించాలన్న బంగ్లాదేశ్ కల ఎట్టకేలకు నిజమైంది. ఈ చారిత్రక విజయంతో రెండు జట్ల మధ్య జరగనున్న రెండో టెస్టుపై ఆసక్తి మరింత పెరిగింది.

ప్రజావీక్షణం
దినపత్రిక

# సైఫ్ అలీ ఖాన్ బర్త్‌డే...

## బికినీ ఫొటోలతో సర్‌ప్రైజ్ ఇచ్చిన కరీనా కపూర్



బాలీవుడ్ స్టార్ హీరో, 'దేవర' విలన్ సైఫ్ అలీ ఖాన్ ఆగస్టు 16న తన 56వ పుట్టినరోజును జరుపుకున్నారు. సోషల్ మీడియాకు సైఫ్ దూరంగా ఉన్నప్పటికీ.. ఆయనకు సంబంధించిన వ్యక్తిగత విషయాలను భార్య, స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఎప్పటికప్పుడు అభిమా నులతో పంచుకుంటుంటారు. ఈసారి కూడా సైఫ్ బర్త్‌డే సందర్భంగా కరీనా చేసిన ప్రత్యేక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సైఫ్ అలీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా కరీనా కపూర్ తమ వెకేషన్‌కు సంబంధించిన పలు అరుదైన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సముద్ర ప్రయాణాలు, బీచ్‌లో సరదా క్షణాలు, పిల్లలతో కలిసి గడిపిన సమయం, లాంగ్ డ్రైవ్‌లు, లిఫ్ట్ ఫొటోలతో పాటు సైఫ్, కరీనా జంటగా ఉన్న పిక్స్ కూడా ఈ పోస్టులో ఉన్నాయి.ముఖ్యంగా స్విమ్ సూట్‌లో కరీనా, వైట్ షర్ట్‌లో సైఫ్ ఉన్న ఫొటో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ జంట కెమెరాకు పోజులిచ్చిన తీరు నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.సైఫ్‌కు పుట్టినరోజు శు భాకాంక్షలు చెబుతూ కరీనా రాసిన క్యాప్షన్ కూడా ప్రత్యేకంగా నిలిచింది. తన జీవిత భాగస్వామికి బర్త్‌డే విషెస్ చెబుతూ.. "నువ్వు లేకపోతే నా జీవితం ఎంత బోర్‌గా ఉండేదో!" అంటూ ప్రేమగా పేర్కొన్నారు. అంతేకాదు.. తాను షేర్ చేసిన ప్రతి ఫొటోను సైఫ్ స్వయంగా చూసి ఓకే చేసినవేనని సరదాగా వెల్లడించారు. దీంతో కరీనా పోస్ట్ అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోలకు బ్యాక్‌గ్రౌండ్‌లో 2008లో వచ్చిన 'తషాన్' సినిమాలోని 'దిల్ డ్యాన్స్ మారే' పాటను కరీనా జత చేశారు. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే సైఫ్, కరీనా మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత వీరి ప్రేమ పెళ్లి వరకు వెళ్లి 2012 అక్టోబర్ 16న ఇద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు.వీశీజఱవంఅప్పటి నుంచి బాలీవుడ్‌లో అత్యంత క్రేజీ జంటల్లో ఒకటిగా సైఫ్-కరీనా పేరు సంపాదించుకున్నారు. వీరికి తైమూర్ అలీ ఖాన్, జెహ్ అలీ ఖాన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్ ఇద్దరూ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. సైఫ్.. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న 'హైవాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనుండగా, సైఫ్ సరికొత్త పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. మరోవైపు కరీనా కపూర్.. మేఘనా గుల్జార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దాయిరా' సినిమాలో నటిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న విడుదల కానుంది.





# రెండు రోజుల్లోనే రూ.80 కోట్లు...

## బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్న ఇమ్రాన్ హష్మీ 'ఆవారాపన్ 2'

బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో నితిన్ కక్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ఆవారాపన్ 2' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్ కానుకగా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా విడుదలైన రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సినిమాతో పోటీగా బరిలోకి దిగిన సినిమాల కంటే ముందు వరుసలో నిలిచి తన జోరును కొనసాగిస్తోంది.మొదటి రోజుతో పోలిస్తే శనివారం ఈ సినిమా కలెక్షన్స్ ఏకంగా 53 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేశాయి. తాజాగా రిపోర్ట్స్ ప్రకారం.. దేశవ్యాప్తంగా దాదాపు 10,496 షోలతో 'ఆవారాపన్ 2' రెండవ రోజు రూ. 33.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారతదేశంలో దీని నెట్ కలెక్షన్లు రూ. 55.75 కోట్లకు చేరుకోగా, ఇండియా గ్రాస్ రూ. 66.90 కోట్లుగా నమోదయ్యాయి. కేవలం దేశంలోనే కాకుండా ఓవర్సీస్ మార్కెట్ లోనూ ఈ చిత్రం సత్తా చాటుతోంది. శనివారం విదేశాల్లో సుమారు రూ. 3.50 కోట్లు రాబట్టగా, మొత్తం ఓవర్సీస్ గ్రాస్ రూ. 6 కోట్లకు చేరింది. దీంతో ఈ సినిమా ప్రపంచవ్యాప్త గ్రాస్ కలెక్షన్స్ సుమారు రూ. 72.90 కోట్లకు చేరుకుని, రూ. 80 కోట్ల మైలు రాయికి చేరువయ్యింది.2007లో వచ్చిన కల్ట్ హిట్ 'ఆవారాపన్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వచ్చింది. మొదటి భాగం మొత్తం వసూలు చేసిన కలెక్షన్ల కంటే, ఈ సీక్వెల్ ఒక్క రోజులోనే దానికంటే సుమారు 27 రెట్లు అధిక వసూళ్లను సాధించి సరికొత్త రికా ర్డుల వైపు అడుగులు వేస్తోంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీతో పాటు దిశా పటాని, షబానా ఆజ్మీ, సువిందర్ విక్కీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆదివారం వీకెండ్ ముగిసేసరికి కలెక్షన్స్ మరింత బలపడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ముంబైలో క్లాసిక్ లవ్‌స్టోరీ?

తెలుగమ్మాయి శ్రీలీల దక్షిణాదిన సినిమాలు తగ్గించింది. దానికి కారణం విజయాలు లేక కాదు. ప్రస్తుతం ఈ ముద్దుగమ్మ కాన్సన్ట్రేషన్ అంతా బాలీవుడ్ పైనే. సాధారణంగా బాలీవుడ్ సినిమాలు ఏండ్ల తరబడి నిర్మాణాలు జరుపుకుంటూ ఉంటాయి. అందుకే.. కాల్‌షీట్స్ మధ్య క్లాష్ రాకుండా తాను ఎంతో నమ్మకం పెట్టుకున్న 'ఆషీకీ 3' సినిమాకు వీలైనంత ఎక్కువ కాల్‌షీట్స్ ఇచ్చి, శ్రద్ధంతా ఆ సినిమాపైనే పెట్టింది శ్రీలీల. యూత్‌ని టార్గెట్ చేస్తూ.. విజువల్ వండర్‌గా, అద్భుతమైన మ్యూజిక్‌తో ఓ దృశ్యకావ్యంగా దర్శకుడు అనురాగ్ బసు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. బాలీవుడ్‌లోనూ క్లాసిక్ లవ్‌స్టోరీ వచ్చి చాలా కాలమైంది. ఈ నేపథ్యంలో 'ఆషీకీ 3'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇందులో శ్రీలీల పాత్ర కీలకంగా ఉంటుందట. అందుకే నటన విషయంలోనూ, లుక్స్ విషయంలోనూ ఆమె ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నదట. కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వైభవంగా మొదలైంది. ఈ షెడ్యూల్‌లో కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలతోపాటు, రెండు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. 'బాలీవుడ్ తెరపై సత్తా చాటేందుకు 'ఆషీకీ 3'నే శ్రీలీలకు బలమైన వేదిక' అంటూ ఆమె అభిమానులు సైతం అభిప్రాయపడుతున్నారు.



# మల్టీస్టారర్‌కి రంగం సిద్ధం?

టాలీవుడ్‌లో ఓ భారీ మల్టీస్టారర్‌కి రంగం సిద్ధమవుతున్నట్టు ఓ వార్త ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. దశాబ్దాలుగా ప్రేక్షకుల్ని అలరిస్తున్న అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జున కాంబినేషన్‌లో ఈ సినిమా రూపుదిద్దుకోనున్నదని సమాచారం. ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమాను అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తారట. ఇప్పటికే ఈ సినిమాకు చెందిన కథాచర్చల్లో అనిల్ రావిపూడి పాల్గొంటున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ ఏడాది సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో దర్శకుడు అనిల్ రావిపూడి భారీ విజయాన్ని అందుకున్నారు.వీశీజఱవం చిరంజీవి హీరోగా రూపొందిన ఆ సినిమా ద్వితీయార్ధంలో వెంకటేశ్ ఎంటర్ కావడం, అక్కడ్నుంచి ఆ ఇద్దరు సీనియర్ హీరోలనూ అనిల్ రావిపూడి హ్యాండిల్ చేసిన విధానాన్ని ఆడియన్స్ ఓ స్థాయిలో ఎంజాయ్ చేశారు. సదరు హీరోల అభిమానుల్లో ఎవరూ హర్ట్ కాకుండా అనిల్ ఆ కథను నడిపించిన తీరు నిజంగా అద్భుతం. అయితే.. 'మన శంకరవరప్రసాద్' సినిమాలో వెంకటేశ్ ప్రత్యేక పాత్ర మాత్రమే పోషించారు. త్వరలో సెట్స్‌కి వెళ్లనున్న చిరు, నాగ్ సినిమాలో ఇద్దరి పాత్రలూ సమప్రాధాన్యతతో ఉంటాయని, అసలైన మల్టీస్టారర్‌గా ఈ సినిమా తెరకెక్కనున్నదని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. ఓ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ ఈచిత్రాన్ని నిర్మించనున్నదట. ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com